



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 | సంచిక : 284 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | గురువారం 19 జూన్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## కృష్ణాలో 500..గోదావరిలో 1000 టీఎంసీలకు..
# ఎన్ఓసీ ఇస్తే బనకచర్లకు అడ్డుచెప్పం





- తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబుతోందన్న సీఎం రేవంత్
- తమ ప్రాజెక్టులకు ఎన్ఓసీ ఇస్తే, ఏపీకి ఎలాంటి అభ్యంతరం చెప్పబోమన్న సీఎం
- గోదావరి-బనకచర్లపై కేసీఆర్, జగన్ 2019లోనే చర్చించారన్న రేవంత్
- కేసీఆర్ చేసిన సంతకమే తెలంగాణకు ప్రతిబంధకమన్న ముఖ్యమంత్రి
- రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేసిన రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నిరభ్యంతర పత్రాలు (ఎన్ఓసీలు) జారీ చేస్తే, ఏపీ ప్రాజెక్టులపై తాము కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పబోమని ఆయన స్పష్టం చేశారు. "ఈరోజు అందుకే నేను పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచన చేస్తున్నాను. కేంద్రంలో మీకు పలుకుబడి ఉండవచ్చు.. మీరేం చెబితే మోదీ గారు అది వినవచ్చు. అలా అని ప్రాజెక్టులన్నింటికీ అనుమతి వస్తుందని అనుకుంటే అది భ్రమ. అలాంటి వాటికి అవకాశం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో అవసరమైన ప్రణాళిక, వ్యూహరచన మా వద్ద ఉంది. మేము వివిధ రాజ్యాంగబద్ధమైన సంస్థలకు ఫిర్యాదు చేస్తున్నాం. అక్కడ మాకు న్యాయం జరగకుంటే న్యాయస్థానాలకు వెళతాం.. అక్కడి నుంచి ప్రజల వద్దకు వెళతాం" అని ఆయన అన్నారు. బుధవారం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు.

### గోదావరి-బనకచర్లపై గత ప్రభుత్వాల ఒప్పందం

2019 అక్టోబరులోనే అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించే విషయంపై చర్చించారని రేవంత్ రెడ్డి అన్నారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే ఒకరకంగా అంకురార్పణ జరిగింది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్లు నాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో కథనాలు కూడా వచ్చాయి" అని ఆయన తెలిపారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### కేసీఆర్ నిర్ణయాలపై రేవంత్ విమర్శలు

2016 సెప్టెంబర్ 21న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, ఏటా 3 వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి పోతోందని అన్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "ఈ విషయంపై మొదట మాట్లాడిందే కేసీఆర్. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో రికార్డుల్లో స్పష్టంగా ఉంది. తెలంగాణకు

## బనకచర్ల అఖిలపక్షం మీటింగ్ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం వేస్తున్న అడుగులకు సంబంధించి.. ఏపీ ప్రభుత్వ వైఖరి.. ఏపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించటానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్షం సమావేశం జరిగింది. ఈ భేటీకి హాజరైన బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు.. మధ్యలోనే సమావేశం నుంచి వెళ్లిపోయారు. వాకౌట్ చేస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ రవిచంద్ర ప్రకటించి.. బయటకు వెళ్లిపోయారు.బనకచర్ల ప్రాజెక్ట్ అనేది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో.. అప్పటి సీఎం కేసీఆర్ చేసిన పని వల్లే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి అన్యాయం జరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అప్పట్లో ఏపీ సీఎంగా ఉన్న జగన్, తెలంగాణ సీఎంగా ఉన్న కేసీఆర్.. హైదరాబాద్ ప్రగతిభవన్ వేదికగా చర్చలు జరిపారని గోదావరి నదిలో 3 వేల టీసీఎంల మిగులు జలాలు ఉన్నాయని, వాటిని శ్రీశైలం తరలించటానికి బనకచర్ల అనే ప్రతిపాదనను అప్పటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారంటూ మినిట్స్ సాక్ష్యంగా వెల్లడించారు సీఎం రేవంత్ రెడ్డి.అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ తీసుకున్న నిర్ణయం వల్లే ఇప్పుడు తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ లెక్కలు, ఆధారాలు, మినిట్స్ తో సహా సీఎం రేవంత్ రెడ్డి వివరాలను అఖిలపక్షం ఎదుట వివరించారు. దీంతో బీఆర్ఎస్ ఎంపీలు ఖంగుతిన్నారు. అఖిలపక్షం సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న ప్రకటించి.. బనకచర్ల ప్రాజెక్టుపై అఖిలపక్షం సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు.

## బనకచర్ల అన్యాయంపై ఉత్తమ్ వద్ద సమాధానం లేదు



- బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే నష్టంపై మంత్రి మౌనంగా ఉన్నారన్న ఎంపీ అర్వింద్
- పవర్‌పాయింట్ ప్రజంటేషన్ అంతా డైవర్షన్ రాజకీయమేనని విమర్శ
- దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపణ
- కేసీఆర్ ఆదేశాలతోనే ఉత్తమ్ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారని ఫైర్
- సిట్ నుంచి తనకు ఎలాంటి పిలుపు రాలేదని స్పష్టం చేసిన అర్వింద్
- మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాప్ చేశారో చెప్పాలంటూ ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో చెప్పమంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వద్ద సమాధానం లేదని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారని అర్వింద్ ఆరోపించారు.బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "బీజేపీ భరోసా కార్యక్రమం ద్వారా ఎన్నో వినతిపత్రాలు స్వీకరించాం. ముఖ్యంగా చాలా మంది దివ్యాంగులు వచ్చి వారి సమస్యలను మాతో పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికిచ్చిన హామీలను కూడా నెరవేర్చడంలో విఫలమైంది. దీనివల్ల ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట దెబ్బతింది" అని అన్నారు. మంత్రి ఉత్తమ్

వివరాలు 2లో..

## బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రిని కలిసిన కిషన్‌రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్:** బనకచర్ల ప్రాజెక్టు వివాదంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం(జూన్18) ఢిల్లీలోని శ్రమశక్తి భవన్ లో కేంద్ర మంత్రులు ఇద్దరు సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిపై నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించారు.
కేంద్ర జలశక్తిమంత్రిత్వ శాఖ నిబంధనలకు

వివరాలు 2లో..

## ఇజ్రాయెల్‌లో తెలంగాణ వ్యక్తి మృతి.. బాంబుల మోతకు ఆగిన గుండె!



- ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ వాతావరణంలో జగిత్యాల వాసి మృతి
- ఉపాధి కోసం రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్ వెళ్లిన రవీందర్
- బాంబు దాడుల శబ్దాలకు గుండెపోటుతో మరణించినట్లు సమాచారం
- మృతదేహం తరలింపుపై కుటుంబ సభ్యుల ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని రవీందర్ భార్య విజ్ఞప్తి

వివరాలు 2లో..

## జీ7 వేదికగా ఏఐ డీప్‌ఫేక్‌లపై ప్రధాని మోదీ ఆందోళన

- ఏఐ రూపొందించిన కంటెంట్‌కు వాటర్‌మార్క్ ఉండాలని సూచన
- ఏఐ సమస్యల పరిష్కారానికి ప్రపంచస్థాయి పాలన అవశ్యమని ఉద్ఘాటన
- పునరుత్పాదక ఇంధన వనరులతోనే సాంకేతికత ఆధారిత సమాజ నిర్మాణం సాధ్యమని వెల్లడి
- భారత్ టెక్నాలజీని ప్రజలకు చేరువ చేసి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిందని వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానం వల్ల తలెత్తుతున్న సవాళ్లు, ముఖ్యంగా డీప్‌ఫేక్‌ల వ్యాప్తిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆల్బెర్టాలో జరుగుతున్న జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఏఐ ద్వారా రూపొందించే

వివరాలు 2లో..

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు...

### రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి

- తన వ్యక్తిగత సంభాషణలు దొంగచాటుగా విన్నారన్న షర్మిల
- ఇది వ్యక్తిగత గోప్యతకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్య
- ఇంతటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడతారా అని ప్రశ్న




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మా ర్గమైన చర్య అని ఆమె మండ పడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న కవిత
- బీసీ రిజర్వేషన్లకు రేవంత్ అనుమతి తీసుకురావాలని డిమాండ్
- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయి లో విమర్శలు గుప్పించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే చూస్తూ

వివరాలు 2లో..

## ఇజ్రాయెల్ శిక్ష అనుభవించాల్సిందే.. ఇరాన్ ఎప్పటికీ లొంగదు

- ఇజ్రాయెల్ దాడి చేసి పెద్ద తప్పు చేసిందన్న ఇరాన్ సుప్రీం లీడర్
- ఇజ్రాయెల్‌కు శిక్ష తప్పదని అయతొల్లా అలీ ఖమేనీ స్పష్టం
- ట్రంప్ తరహా బెదిరింపులకు ఇరాన్ లొంగిపోదని వెల్లడి
- అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక

వివరాలు 2లో..



## వాహనదారులకు తీపికబురు.. కేంద్రం కీలక ప్రకటన!

- కేంద్రం నుంచి ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్ ప్రకటన
- ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి అమలు
- వార్షిక పాస్ ధర రూ.3000గా ఖరారు
- ఏడాది లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు
- కార్లు, జీపులు, వ్యాన్ల వంటి నాన్-కమర్షియల్ వాహనాలకు వర్తింపు
- త్వరలో యాక్టివేషన్ లింక్ అందుబాటులోకి

**హైదరాబాద్ పెన్ పవర్:**జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఫాస్టాగ్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా వార్షిక పాస్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రైవేటు వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ముఖ్యంగా తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

### కేవలం రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్

ఈ నూతన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# పొలిటికల్ "గేమ్" ఛేంజర్

పోలవరం ప్రాజెక్టు ఇంత వరకూ పూర్తి కాలేదు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదాగా ప్రకటించింది. అయితే 2014లో ఏర్పాటయిన తెలుగుదేశం ప్రభుత్వం కానీ, 2019 లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం కానీ పూర్తి చేయలేకపోయింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 2027 కల్లా పూర్తి చేసి సాగునీరు అందిస్తామని చెబుతుంది. అయితే పోలవరం పూర్తికాకముందే ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంట పుట్టిస్తుంది. పోలవరమే పూర్తిచేయలేని ప్రభుత్వాలు ఈ బనక చర్ల ప్రాజెక్టును ఏ మేరకు పూర్తి చేస్తాయన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

**ఎనభై వేల కోట్ల రూపాయలు...**

బనకచర్ల ప్రాజెక్టు అంచనా వ్యయమే ఎనభై వేల కోట్ల రూపాయలు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పట్లో సహకరించే పరిస్థితి లేదు. అదే సమయంలో పోలవరం ప్రాజెక్టుతో పాటు అమరావతి రాజధాని నిర్మాణ పనులను కూడా వేగంగా పూర్తి చేయాలి. ఇటువంటి పరిస్థితుల్లో బనకచర్ల ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అని చంద్రబాబు చెబుతున్నప్పటికీ, రాయలసీమకు గోదావరి నీటిని తరలించేందుకు అంటున్నప్పటికీ ఆచరణలో ఎంత వరకూ సాధ్యమన్న కామెంట్స్ ఆంధ్రప్రదేశ్ లోనే వినిపిస్తున్నాయి. ఎనభై వేల కోట్ల రూపాయల నిధుల సేకరణతో పాటు భూములను రైతుల నుంచి సేకరించడం కూడా ప్రస్తుత ప్రభుత్వానికి బనకచర్లప్రాజెక్టు విషయంలో సవాల్ గా మారనుంది.

**ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు...**

బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌కు అనేకసార్లు వినతి చేశారు కూడా. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి తొలి అడుగుపడింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర పర్యావరణ నిపుణుల అంచనాల కమిటీ మంగళవారం సమావేశమయింది. పర్యావరణ అనుమతులపై ఈ సమావేశంలో చర్చించారు. ప్రొఫెసర్ చక్రపాణి నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటు అయ్యింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఈ కమిటీ సమావేశమైంది. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని కమిటీ అంచనా వేయనుంది. తర్వాత కేంద్ర ప్రభుత్వానికి బనకచర్ల ప్రాజెక్టుపై నివేదిక సమర్పించనుంది.

**తెలంగాణ అభ్యంతరాలు...**

అయితే బనకచర్ల ప్రాజెక్టును అనుమతించకూడదని, రిజెక్ట్ చేయాలంటూ తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడి ఈఏసీకి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని తెలిపారు. గోదావరి నీటిని కృష్ణలో కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దీని వల్ల తెలంగాణ హక్కులను హరించినట్లు అవుతుందని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం చెబుతుంది. మరొక వైపు ప్రస్తుతమున్న తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షమైన బీఆర్ఎస్ నుంచి కూడా వత్తిడిపెరుగుతుంది. ఈ నేపథ్యంలో నేడు ఉత్తమ్ కుమార్ రెడ్డి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలవరమే పూర్తి కాకుంటే... బనకచర్లపై ఈ రగడ ఏందని ఏపీ నేతలు అంటున్నప్పటికీ మొత్తం మీద బనకచర్ల పొలిటికల్ గేమ్ ఛేంజర్ గా మారిందనే చెప్పాలి.

# కృష్ణాలో 500..గోదావరిలో 1000 టీఎంసీలకు..

# ఎన్ఓసీ ఇస్తే బనకచర్లకు అడ్డుచెప్పం

- మొదటి పేజీ తరువాయి

కృష్ణా నది జలాల్లో 299 టీఎంసీలు సరిపోతాయని కూడా ఆనాడే కేసీఆర్ అంగీకరించి సంతకం చేశారు. ఆ సంతకమే ఇప్పుడు తెలంగాణకు గుదిబండగా మారింది" అని ఆయన విమర్శించారు. తెలంగాణకు 968 టీఎంసీల నీటిని వాడుకునేలా ప్రాజెక్టులకు ఏపీ ఎన్ఓసీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**భవిష్యత్ కార్యాచరణ**

గోదావరి–బనకచర్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటామని చెప్పారు. ఈ విషయంలో అన్ని పార్టీలను కలుపుకొని పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

**సీఎం వ్యాఖ్యలను ఖండించిన బీఆర్ఎస్ ఎంపీ**

మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే కేసీఆర్ మాట్లాడారని ఆయన వివరణ ఇచ్చారు. కృష్ణా నదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే తమకు అభ్యంతరం లేదని మాత్రమే కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. ఈ సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందని ఆరోపించారు.

# బనకచర్ల అన్యాయంపై ఉత్తమ్ వద్ద సమాధానం లేదు

- మొదటి పేజీ తరువాయి

కుమార్ రెడ్డి వ్యవహార శైలిపై అర్వింద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఉత్తమ్ కుమార్ రెడ్డి సగం కాంగ్రెస్, సగం బీఆర్ఎస్ వ్యక్తిలా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి దర్శకత్వంలోనే తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఇదంతా కేవలం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆడుతున్న నాటకం" అని అర్వింద్ ఆరోపించారు. బీజేపీ మీద బురద చల్లేందుకే ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపైనా అర్వింద్ స్పందించారు. "నన్ను సిట్ విచారణకు పిలిచినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. నాకు ఎలాంటి నోటీసులు అందలేదు. అసలు మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్‌ను ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదు" అని అర్వింద్ వ్యాఖ్యానించారు. బనకచర్ల విషయంలో వాస్తవాలు మాట్లాడకుండా, పవర్ పాయింట్ ప్రజంటేషన్లతో కాలయాపన చేయడం ద్వారా ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని అర్వింద్ హితవు పలికారు.

# రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే నామినేషన్లు వేయనిస్తాం. లేదంటే ప్రతి వార్డులో వందల సంఖ్యలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తాం" అని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ, మండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని, పార్లమెంటులో ఈ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. "జులై రెండో వారం వరకు కేంద్రానికి గడువు ఇస్తున్నాం. ఆలోపు అనుమతి రాకపోతే జులై 17 నుంచి రైలు రోకోలు నిర్వహిస్తాం" అని కవిత హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అడ్డుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ కగార్" పైన

కూడా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఎన్‌కౌంటర్లు అమానవీయ చర్యలని, ఈ ఆపరేషన్‌ను తమ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. మావోయిస్టు సమస్యకు చర్చలే పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

# ఇజ్రాయెల్ శిక్ష అనుభవించాల్సిందే.. ఇరాన్ ఎప్పటికీ లొంగదు

తమ దేశంపై దాడి చేసి ఇజ్రాయెల్ పెను తప్పిదానికి ఒడిగట్టిందని, అందుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆయన వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇరాన్ ఎప్పటికీ లొంగిపోదని ఆయన స్పష్టం చేశారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలను గుర్తు చేస్తూ, ఇటువంటి బెదిరింపులకు ఇరాన్ లొంగేది లేదని ఖమేనీ తేల్చి చెప్పారు. ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి ఈ విషయం సుస్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. ఒకవేళ అమెరికా సైన్యం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుంటే, అమెరికా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇరాన్ ఎన్నటికీ తలవంచదని ఆయన పునరుద్ఘాటించారు.

ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల్లో అమెరికా జోక్యం చేసుకుంటే, అది పశ్చిమాసియా ప్రాంతంలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హెచ్చరించారు. ప్రస్తుత ఘర్షణలపై తొలిసారిగా స్పందించిన ఆయన, తమ దేశంపై జరిగిన దాడులకు ధీటుగా బదులిస్తామని స్పష్టం చేశారు. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమేనీ ఎక్కడ దాక్కున్నాడో తమకు తెలుసని, ఆయన సురక్షితంగానే ఉన్నారని, అయితే ప్రస్తుతానికి ఆయన్ను అంతమొందించాలనే ఉద్దేశం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు.

# కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు...

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశాం ని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రిని కలిసిన కిషన్‌రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

అనుగుణంగా పరిశీలించిన తర్వాతే గోదావరిపై బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డియి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారు. అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించిన తర్వాత పారదర్శకంగా ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారు.

# వాహనదారులకు తీపికబురు.. కేంద్రం కీలక ప్రకటన!

- మొదటి పేజీ తరువాయి

తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. ఈ వార్షిక పాస్ పొందాలనుకునేవారు రూ.3000 చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాస్ యాక్టివేట్ చేసుకున్న నాటి నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే, అప్పటితో పాస్ గడువు ముగుస్తుంది. ప్రస్తుతం ఈ సౌకర్యం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర (నాన్–కమర్షియల్) వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని గడ్కరీ తన పోస్ట్‌లో వివరించారు.

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జాతీయ రహదారులపై ఈ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. పాస్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి త్వరలోనే ఒక ప్రత్యేక లింక్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఈ లింక్ 'రాజ్‌మార్గ్' యాప్‌తో పాటు ఎన్‌హెచ్ఏఐ (భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ), ఎంఓఆర్‌టీహెచ్ (రహదారి రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ) అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.ప్రయాణికుల నుంచి చాలాకాలంగా వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల టోల్‌ప్లాజాల వద్ద రద్దీ తగ్గడమే కాకుండా టోల్ రుసుముకు సంబంధించిన వివాదాలు కూడా తగ్గుముఖం పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది ప్రైవేటు వాహన యజమానులకు ఇది మరింత సౌకర్యవంతమైన, సులభతరమైన ప్రయాణ అనుభూతిని అందిస్తుందని మంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇజ్రాయెల్‌లో తెలంగాణ వ్యక్తి మృతి..

# బాంబుల మోతకు ఆగిన గుండె!

ఉపాధి కోసం సుదూర దేశం వెళ్లిన తెలంగాణ వాసి... ప్రస్తుతం ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అకాల మరణం చెందాడు. జగిత్యాల జిల్లాకు చెందిన రవీందర్ అనే వ్యక్తి ఇజ్రాయెల్‌లో ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆయన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం రవీందర్ ఇజ్రాయెల్ వెళ్లాడు. పూర్తి వివరాల్లోకి వెళితే... ప్రస్తుతం ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులతో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అక్కడ జరుగుతున్న భీకర బాంబు దాడుల శబ్దాలకు రవీందర్ తీవ్ర ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

ఇక, ఈ వార్త విన్నప్పటి నుంచి ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి కుటుంబాన్ని పోషించుకోవడానికి వెళ్లిన వ్యక్తి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం వారిని తీవ్రంగా కలచివేసింది. యుద్ధ పరిస్థితుల కారణంగా ఇజ్రాయెల్‌కు విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో రవీందర్ మృతదేహాన్ని స్వదేశానికి ఎలా తీసుకురావాలనే విషయంపై ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ప్రభుత్వం చొరవ తీసుకుని తన భర్త మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని రవీందర్ భార్య కన్నీటిపర్యంతమవుతూ వేడుకుంటున్నారు. అంతేకాకుండా తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కూడా ఆమె ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. విదేశాల్లో ఉన్న తమ వారి భద్రత గురించి తోటి వలస కార్మికుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి రవీందర్ కుటుంబానికి అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

# జీ7 వేదికగా ఏఐ డీప్‌ఫేక్‌లపై ప్రధాని మోదీ ఆందోళన

- మొదటి పేజీ తరువాయి

కంటెంట్‌కు తప్పనిసరిగా వాటర్‌మార్కింగ్ ఉండాలని లేదా అది ఏఐ సృష్టించినదనే స్పష్టమైన ప్రకటన ఉండాలని అభిప్రాయపడ్డారు. సమాజంపై ఏఐ చూపిస్తున్న ప్రభావం గురించి ప్రస్తావిస్తూ, ఈ సాంకేతికతకు సంబంధించిన సమస్యలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా సమగ్రమైన పాలనా వ్యవస్థ అవసరమని ప్రధాని మోదీ సూచించారు. ప్రస్తుత యుగం ఏఐదే అయినప్పటికీ, సాంకేతికతతో కూడిన వ్యవస్థలను సురక్షితంగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన నొక్కిచెప్పారు. డీప్‌ఫేక్ కంటెంట్ వల్ల తలెత్తే ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటు ధరల్లో, నమ్మకమైన, స్థిరమైన సాంకేతిక వ్యవస్థలను అందించడమే భారత్ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ప్రయోజనం చేకూర్చినప్పుడే దానికి నిజమైన విలువ ఉంటుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఏ దేశాన్ని కూడా వెనుకబడనివ్వకూడదని ఆయన అన్నారు. భారత్ తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్యబద్ధం చేసిందని, తద్వారా ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా సామాన్య ప్రజలను కూడా శక్తివంతం చేసిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సమగ్రమైన, సామర్థ్యవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరు లో యోగాంధ్ర పై అవగాహన ర్యాలీ








**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 18:**జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్. రసూల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ రసూల్ మాట్లాడుతూ ఈ నెల 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతి యువకులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ ఏడాది యోగా దినోత్సవం థీమ్ "ఒక భూమి - ఒక ఆరోగ్యం"గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాక్టివిటీ కోఆర్డినేటర్ పి. కోటేశ్వరరావు మాట్లాడుతూ యోగా ద్వారా కదలిక, శ్వాస మరియు ధ్యానం శరీరానికి, మనస్సుకు ఒకేసారి లాభదాయకంగా ఉంటాయని, ఇది శారీరక మరియు మానసిక ఆరోగ్యాలను %జూ%మెరుగుపరుస్తుందని వివరించారు.జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ జి. గౌరీ శంకరరావు మాట్లాడుతూ యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాక, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతకు స్ఫూర్తిని కూడా అందిస్తుందని తెలిపారు. ర్యాలీలో కళాశాల విద్యార్థులు, జూనియర్ కళాశాల, మాదమాంబ అక్షర హై స్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో పాల్గొన్నారు. ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు వెళ్లి అక్కడ మానవహారం ఏర్పాటు చేసి యోగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వి. రమేష్ బాబు, డాక్టర్ జానకిరామ్, సిహెచ్. జి. దామోదరం, జి. భాస్కరరావు, డాక్టర్ గణేష్, సుమిత్ర, నిర్మల, సునీత, రాధాకుమారి, జయలక్ష్మి, వారిజా, వి. శంకరరావు, పి. చంద్రశేఖర్, హై స్కూల్ పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ను కలిసిన PTG నూతన ప్రిన్సిపల్.ఏ.సత్యవతి.



**గుమ్మలక్ష్మిపురం.జూన్18.పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో గల %ఱు+% రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ గా ఏ.సత్యవతి బాధ్యతలు చేపట్టారు. అనంతరం బుధవారం నాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉన్నతమైన విద్యను అందించాలని ప్రిన్సిపాల్ కు ఎమ్మెల్యే వారికీ సూచించారు. అలాగే అందరి సహకారంతో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పించేలా కృషి చేస్తానని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర ట్రాఫిక్ నిర్వహణకు ఏ.ఎస్.టి.ఆర్. ఏ.ఎం యాప్ శిక్షణ

- రెండు రోజులలో 182 మంది పోలీస్ సిబ్బందికి



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 18 :**యోగాంధ్ర ఈవెంట్ ట్రాఫిక్ నిర్వహణ కోసం రెండు రోజులలో 182 మంది పోలీస్ సిబ్బందికి ఏ.ఎస్.టి.ఆర్.ఏ.ఎం యాప్ శిక్షణ పెద్ద ఎత్తున జనసందోహం ఆశించబడుతున్న యోగాంధ్ర ఈవెంట్ సందర్భంలో రహదారి రద్దీ సమర్థంగా నిర్వహించేందుకు 182 మంది పోలీస్ సిబ్బంది కి నేడు ఆక్సిలబుల్ ఇంటెలిజెన్సీ ఫర్ సస్టైన బుల్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ యాప్ పై శిక్షణ ఇవ్వ బడింది. ఈ శిక్షణను ఏ ఆర్ సి ఎ డి ఐ ఐ బి ఐ గ్రూప్ (స్మార్ట్ సిటీ పరిష్కారాల్లో ప్రఖ్యాత గ్లోబల్ సంస్థ) స్థానిక పోలీసు శాఖ మరియు మున్సిప ల్ అధికారులతో కలిసి నిర్వహించింది.

ఏ.ఎస్.టి.ఆర్.ఏ.ఎం యాప్ రియల్ టైమ్ ట్రాఫిక్ నిఘా, పార్కింగ్ స్థలాల లైవ్ అప్డేట్స్, సంఘటనల నివేదికలు, మరియు ప్రజలకు అధికారిక సూచనలు అందించే అత్యాధునిక ప్లాట్‌ఫారంగా రూపొందించబడింది. ఈ యాప్ ను 2025 జూన్ 08న హోంశాఖ మంత్రి లాంచ్ చేశారు.శిక్షణలో భాగంగా, పోలీసులు యాప్ లోని ముఖ్యమైన ఫీచర్లను ప్రాక్టికల్ డెమోలు, సిమ్యులేషన్ ద్వారా నేర్చుకున్నారు. ఏ.ఎస్.టి. ఆర్.ఏ.ఎం , జీపీఎస్ డేటా, సిసిటివి ఫీడ్స్ మరియు ఏఐ విశ్లేషణల ద్వారా ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్ రీ-రూటింగ్, సిగ్న ల్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయటానికి సహాయపడుతుంది. యోగాంధ్ర ఈవెంట్ సమయంలో పార్కింగ్‌ను సమర్థవం తంగా నిర్వహించేందుకు, ఈ యాప్ లైవ్ పార్కింగ్ సమాచారం అందిస్తుంది. అలాగే, ప్రజలు యాప్ ద్వారా ట్రాఫిక్ అప్డేట్స్, పార్కింగ్ సమాచారం తెలుసుకోవచ్చు మరియు సంఘట నల నివేదికలు పంపించవచ్చు.

ఈ శిక్షణతో, పోలీసులు ఏ.ఎస్.టి.ఆర్.ఏ.ఎం ను వాడటానికి సిద్ధంగా ఉండగా, నగర ట్రాఫిక్ నిర్వహణ మరింత సాంకేతికంగా, సమర్థవం తంగా మారనుంది.ప్రజలు ఏ.ఎస్.టి.ఆర్.ఏ.ఎం యాప్‌ను డౌన్‌లో డ్ చేసుకుని ప్రయాణాన్ని సమర్థవంతంగా ప్లాన్ చేసుకోవాలని కోరడమవుతుంది.

## యోగాంధ్ర విస్తృత స్థాయిలో బందోబస్తు

- యోగాంధ్ర బందోబస్తు విధులను అంకితభావం తో నిర్వహించాలి
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, జూన్ 18 :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా జూన్ 21న జరగనున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం సాగర తీరంలో పెద్ద ఎత్తున చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనను న్న నేపథ్యంలో విశాఖ ఐటి సెజ్ నుండి కాపుల ఉప్పాడ వరకు ఏర్పాటు చేసిన 59 కంపార్టు మెంట్లులో విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి బందోబస్తు, భద్రత విధులు నిర్వహించేందుకు నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందితో రుషికొండ ఎ-1 ఫంక్షన్ హాలులో సమావేశమై, వారు నిర్వహించాల్సిన విధుల గురించి దిశా నిర్దేశం చేసారు.ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - యోగాంధ్ర కార్యక్రమ నిర్వ హణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా బందోబస్తు, భద్రత విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. విశాఖ ఐటి సెజ్ నుండి కాపుల ఉప్పాడ వరకు ఏర్పాటు చేసిన 59 కంపార్టుమెంట్లలో ప్రజలు చేరుకొనే విధంగా చూడాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంకు ప్రజ లు బస్సుల్లో చేరుకొంటున్నందున ఆయా బస్సులను వారికి కేటాయించిన పార్కింగు స్థలాల్లోకి పార్కింగు చేసుకొనే విధంగా ఇతర అధికారులతో సమన్వయంతో పని చేయాల న్నారు. ట్రాఫిక్ ఎటువంటి అవాంతరాలు జరగకుండా ట్రాఫిక్ రెగ్యులేషను చేయాలని అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసారు. ముఖ్య వ్యక్తుల భద్రత దృష్ట్యా జిల్లా మీదుగా విశాఖపట్నం వెళ్ళే కొత్తవలస మండ లం చింతలపాలెం, డెంకాడ మండలం రాజా పులోవ వద్ద రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేసామన్నారు. ఈ చెక్ పోస్టులు వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఆర్ ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, పలువురు డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 2028 నాటికి శత శాతం సేంద్రీయ వ్యవసాయం



జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2028 నాటికి శత శాతం సేంద్రీయ వ్యవసాయం సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు.రైతులకు అందించిన వ్యవయాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించాలన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాల పొందిన రైతులు, వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో మెకనైజేషన్ ఆంతర్యం లేకుండా సర్వే చేసి ఎంత మేరకు వ్యవసాయ పరికరాలు అవసరమైవుతాయో ప్రణాళికలు తయారు చేయాలని సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎంత మంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు ? పంటలకు యూరియా, పొటాషియం, పురుగుల మందులు ఎంత మంది వినియోగిస్తున్నారని రైతులను అడిగి తెలుసు కున్నారు.వ్యవసాయ పరికరాలు రాయితీ పై ప్రభుత్వం అందిస్తుందని రైతులకు ఎలా తెలిసిందని ఆరా తీసారు. సేంద్రీయ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి చర్యలు చేపట్టామన్నారు. నీడ తోటలకు మద్ది, నేరేడు, పనస మొక్కలను రైతులకు ఉపాధి హామీ పథకంలో పంపిణీ చేస్తామన్నారు.

భూములున్న రైతులు కాఫీ సాగును విస్తరించాలని సూచించారు.జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్ మాట్లాడుతూ 351 మంది రైతులకు రూ.1.26 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసామన్నారు. 95 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు,29 మందికి ట్రాక్టర్లు, 59 మంది పవర్ టిల్లర్లు, 13 బ్రష్ కట్టర్లు, 155 మందికి పవర్ వీడర్లను 50 శాతం రాయితీపై అందించడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేసారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, అరకు వ్యాలీ, పాడేరు, వి. మోహనరావు, ఝాన్సీ లక్ష్మి, ఎం. వి. శ్రీనివాస్, డి పి ఎం ఎస్.జె.వి. రామ మోహనరావు, కుమార్. డిపి ?? ఎల్.భాస్కరరావు, జీవివి విజయ మండల వ్యవసాయాధికారులు, గిరిజన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయగ్రామఉత్కర్ అభియాన్ పీఎం జన్మన్ గ్రామసభలు







**చింతపల్లి పెన్ పవర్ జూన్ 18:-** చింతపల్లి మండలంలో 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న ధాత్రి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పీఎం జన్మన్ గ్రామసభ కార్యక్రమము లో భాగంగా బుధవారం రోజున చౌడుపల్లి పంచాయతీలో చౌడేపల్లి, కిటుముల పంచాయతీలో పకాబు గ్రామంలో, లోతుగడ్డ పంచాయతీలో చెరుకుం పాకలు మరియు కొమ్మంగి పంచాయతీలో కొమ్మంగి గ్రామ లలోక్యాంపునిర్వహించడమైనది. ఈ క్యాంపులు ఆయా పంచాయతీ ల పంచాయతీ కార్యదర్శులు మరియు సర్పంచులు ఆధ్వర్యంలో జరిగినవి. ఈ క్యాంపులో భాగంగా ప్రతి గ్రామ సభలో ఆధార్ క్యాంపు, మెడికల్ క్యాంపు ,రేషన్ కార్డు సర్వీస్ సేవల క్యాంపు ,క్యాస్ట్ సర్టిఫికెట్, జన్ధన్ ఎకౌంటు మరియు పీఎం కిసాన్ వంటి వాటిపై కౌంటర్లు ఏర్పాటు చేసి సదరు సేవలు ఆయా గ్రామసభల్లో అందించడం జరిగినది. అలాగే రేపు అనగా తేదీ 19 తేదీన అంతర్ల, గొందిపాకలు, కిన్నెర్ల గ్రామాలలో ఈ గ్రామ సభలు జరుపబడును కావున ప్రజలందరూ గ్రామసభలో నిర్వహించబడే క్యాంపులలో ఉన్న సదుపాయాన్ని వినియోగించుకోగలరని కోరుచున్నాను.

## మాడుగుల నియోజకవర్గం టీడీపీ సంస్తాగత ఎన్నికల పరిశీలకుడిగా మరిడయ్య.....



**నాతవరం పెన్ పవర్ (జూన్ 18):** మంగళగిరి టీడీపీ కేంద్రపార్టి కార్యాలయం నుండి వెలువడినఉత్తర్వులు ప్రకారం ఏపీ ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడయ్య ను అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో గల మాడుగుల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా నియమించారు.ఈ సందర్భంగా బుధవారం మీడియాతో మరిడయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని,నన్ను గుర్తించి పార్టీ పై ఇంతటి బాధ్యతను అప్పగించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి,నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివసరావు,టీడీపీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏపీ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్న పాత్రుడు,టీడీపీ ఏపీ స్టేట్ ప్రధాన కార్యదర్శి చింతాకాయల విజయ్ కి రుణపడి ఉంటానని ఆయన అన్నారు.

## వాసుపల్లికి దక్షిణ రథసారదుల కృతజ్ఞతలు

- వైయస్సార్సీపి పార్టీ బలోపేతమే లక్ష్యం
- నూతనంగా నియమితులైన వార్డు అధ్యక్షులు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 18 :**పార్టీ అభివృద్ధికి కోసం అహర్నిశలు కష్టపడిన వారికి దక్షిణ నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి వార్డు అధ్యక్షుల పదవీ వరించాయి. ఈ మేరకు బుధవారం ఆశీలమెట్ట కార్యాలయంలో 30వ వార్డ్ ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, 35వ వార్డ్ ప్రెసిడెంట్ అలుపన కనకా రెడ్డి, 39వ వార్డ్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కోన శంకర్ దక్షిణ మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. అధిష్టానం వాసుపల్లి అభ్యర్థన మేరకు నూతన దక్షణ వార్డు అధ్యక్షులు పదవి తమకి కేటాయిం చినందుకు పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణంలో వాసుపల్లి అఖండ మెజార్టీతో గెలిపించుకునే విధంగా తామంతా కష్టపడి వైఎస్ఆర్సిపి బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపాలన ఎండగడతూ పేద ప్రజలకు అందాల్సిన సంక్షేమం, అభివృద్ధి పై ప్రజల పక్షాన వైయస్సా ర్సీపి తరపున పోరాడుతామన్నారు. విశాఖ సిటీ సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆదివిష్ణు రెడ్డి,జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్, జిల్లా %=×% ప్రెసిడెంట్ వడ్డది దిలీప్,జిల్లా %ంక% సెల్ వైస్ ప్రెసిడెంట్ కోన శంకర్,సౌత్ %ంక% సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్,విశాఖ సౌత్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు సువర్తరాజు, విశాఖ సౌత్ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు జీరు సూర్యనారాయ ణ,సౌత్ యూత్ ప్రెసిడెంట్ తాడి రవితేజ, 42వ వార్డ్ ప్రెసిడెంట్ భీశెట్టి ప్రసాద్,30వ వార్డ్ ఇంచా ర్జి దశ మంతుల చిన్ని, కర్రీ రాము, బత్తుల రాము, గంగాధర్, కనకమ్మ, యాళ్ల రవణమ్మ, సిమ్మ పుష్ప, అలుపనరమణమ్మ , పోలవరపు రమణమ్మ, రంగాల రవికుమార్, నాగిరెడ్డి, రాంబాబు, లండసుధా,పిట్టా శ్రీనివాస్ రెడ్డి, వేణు గారు, బాలు గారు, రవితేజ గారు, రాము గారు, శ్యామ్ గారు, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన. ప్రకాశ్ గారు, మైక్ లాబ్స్ ఈశ్వర్, వినోద్, నగేష్, శేఖర్, దుర్గాప్రసాద్, అజయ్, మాలి బాబు, సాగర్, సత్య,రామరాజు, చింతూకాయల వాసు, సత్య, 39 వ వార్డ్ ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కెకె రాజుకి కృతజ్ఞతలు తెలియజేసిన జీలకర్ర నాగేంద్ర



**గాజువాక: పెన్ పవర్, జూన్ 18:**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజుని పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని తనని పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు జీలకర్ర నాగేంద్ర.

# జిల్లాలో శత శాతం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి





- యోగేంద్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- రాష్ట్రంలో మారిన విద్యా విధానానికి అనుగు ణంగా విద్యాబోధన, పాఠశాల నిర్వహణ జరగాలి
- పాఠశాలల్లో విద్యార్థుల నమోదుల సంఖ్య పెరగాలి
- జిల్లా విద్యాశాఖ ఆధికారి జి అప్పారావు నాయుడు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అనకాపల్లి, జూన్ 18** :అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని మన అనకాపల్లి జిల్లాలో శత శాతం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశా ఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు కోరారు. అనకాపల్లి జిల్లా కసింకోట సెయింట్ ఆన్స్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల నిర్వహణ, బోధన, మూల్యాంకనం, మధ్యాహ్న భోజన పథకం తదితర అన్ని కార్యక్రమాల్లో మార్పు వచ్చిందన్నారు. కొత్త ఆవిష్కరణల్లో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్ లను అన్ని పాఠశాలల్లో, అందరు ఉపాధ్యాయులు శత శాతం అమలు చేయాల్సిందేనన్నారు. అర్హులందరికీ ఇప్పటికే తల్లికి వందనం నగదు ప్రోత్సాహాలు తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. అర్హులు ఎవరికైనా తల్లికి వందనం పథకం వర్తింపు జరగని పక్షంలో సంబంధిత గ్రామ సచివాలయాల్లో తెలియజేసి, వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని పాఠశాలలో విద్యార్థుల నమోదులు పెంచాలన్నారు. స్థానికులను భాగస్వాములు చేసుకుని ఆయా ప్రాంతాల్లో విస్తృతమైన ప్రచారం నిర్వహించాలన్నారు. పదోన్నతులు, బదిలీల ద్వారా దాదాపుగా అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు రావడం జరిగిందన్నారు. అవసరం మేరకు పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా స్థాయిని పెంచడం జరిగిందన్నారు. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఎదురైతే సర్దుబాటు చేస్తామన్నారు. ప్రతి విద్యార్థికి అవసరమైన పుస్తకాలు, వస్త్రాలు, బ్యాగులు, బూట్లు అందజేస్తున్నామన్నారు. మారిన మెనూ కు అనుగుణంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రతి విద్యార్థికి అందజేయాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యంను మాత్రమే వినియోగించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అన్ని పాఠశాలల పర్యవేక్షణ, పరిశీలన పెంచడం జరుగుతుందన్నారు. జిల్లాలో మంచి లక్ష్యాలు, ఫలితాలను సాధించే దిశగా ప్రారంభం నుంచే ప్రణాళికా యుతంగా అందరం కలిసి ముందుకు వెళదామని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పొన్నాడ అప్పారావు, ఏసీ శ్రీధర్ రెడ్డి, డిసిసిబి కార్యదర్శి సత్యనారాయణ, సి సి వెంకటేశ్వర రావు, ఎంఈఓ లు, హెచ్.ఎం.లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వై.సి.పి.రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన కే వి బాబా

- వై ఎస్ ఆర్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కే కే రాజు తో కే విబాబా ములాఖత్



**విశాఖ ఉత్తరం పెన్ పవర్ జూన్ 18** :వై ఎస్ ఆర్ సిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గా కే వి బాబా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారిచేసింది. తనపై ఉన్న నమ్మకం తో వై ఎస్ ఆర్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమించిన మాజీ ముఖ్యమం త్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డికి, వై ఎస్ ఆర్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కే కే రాజు కి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కి, రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు కి,కే వి బాబా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసా రు. ఈ మేరకు విశాఖ జిల్లా వై ఎస్ ఆర్ పార్టీ అధ్యక్షులు కే కే రాజు ను కే వి బాబా బుధవా రం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా తో సత్కరించి, పుష్పగుచ్చం ఇచ్చి ములఖత్ అందుకున్నారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఐ హెచ్ ఫరూఖి, వై ఎస్ ఆర్ సీపీ మైనారిటీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షులు, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలివిశాఖ జిల్లా పెన్షన్ విభాగం అధ్యక్షులు దేవరకొండ మార్కండేయులు, (అలియాస్)మొహమ్మద్ ఇబ్రహీం,వై ఎస్ ఆర్ సీపీ 39 వ వార్డు అధ్యక్షు లు ముజీబ్ ఖాన్, దక్షిణ నియోజకవ ర్గం మైనార్టీ అధ్యక్షులు బాబ్జి, విశాఖ జిల్లా మైనారిటీ సెల్ సెక్రటరీ నిజాం,వై ఎస్ సీపీ సీనియర్ నాయకులు భాషా తదితరులు పాల్గొన్నారు.

# వివిధ శాఖల అధికారులతో ఐ బి ఏ డి జి రాజిందర్ చౌదరి సమీక్ష



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 18 :** విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: పి ఐ బి ఏ డి జి రాజిందర్ చౌదరి విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అదనపు డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి సూచించారు.బుధవారం విశాఖపట్నంలోని ఆల్ ఇండియా రేడియో కార్యాలయంలో జరిగిన ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశానికి రాజిందర్ చౌదరి అధ్యక్షత వహించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్స వం 2025 ను విజయవంతం చెయ్యడం గురిం చి వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల విభాగాలకు చెందిన కీలక అధికారులతో చర్చించారు. అలాగే మీడియా, సోషల్ మీడియాను ఉపయోగించుకొని యోగ డే కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో పి ఐ బి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఇండియా పోస్ట్, ఇండియన్ రైల్వేస్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో విభాగాల అధికారుల తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా డే ప్రచారంలో భాగంగా బుధవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేష న్ , విశాఖపట్నంలోని మలతాంబ విద్యానికేత న్ పాఠశాలలో నిర్వహించిన యోగా సెషన్‌కు ముఖ్య అతిథిగా ఏ.డి.జి.రాజిందర్ చౌదరి హాజరయ్యారు. యోగా సెషన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఏ.డి.జి రాజిందర్ చౌదరి మాట్లాడుతూ, రోజువారీ జీవితంలో యోగా చాలా ముఖ్యమైనదని, పాఠశాల రోజుల నుండే యోగా సాధన అలవా టు చేసుకోవాలన్నారు. విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించడంలో, మానసికంగా, శారీరకంగా ఆరోగ్యకరమైన తరం తయారు కావడానికి యోగ సహాయపడుతుందని చెప్పారు.

# చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే రోజుగా జూన్ 21 యోగాంధ్ర



- యావత్ ప్రపంచం చూపు విశాఖ వైపు
- యోగాంధ్ర కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు
- మంత్రి డా.డోలా బాలవీరాంజనేయస్వామి

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 18** :యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డా. డోలా బాలవీ రాంజనేయస్వామి తెలిపారు. బుధవారం నాడు విశాఖ దసపల్లా హొటల్ లో మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, విఎమ్ఆర్డిఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తో కలసి మీడియా సమావేశంలో మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి మాట్లాడుతూ, యోగా మన సాంప్రదాయానికి ప్రతిరూపం మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి ఆరోగ్య జీవనశైలిలో భాగం. ప్రధాని నరేంద్ర మోదీ భావనలతో ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఇప్పటివరకు 10 యోగా దినోత్స వాలు ఘనంగా నిర్వహించాం, 11వ యోగా దినోత్సవాన్ని విశాఖ నగరంలో జరపడం రాష్ట్రానికి గర్వకారణం. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానుం డగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు కూడా యోగాసనాల్లో పాల్గొననున్నారు. ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. విశాఖ బీచ్‌లో కాళీ మాత ఆలయం నుంచి బీచ్ వరకు యోగా ప్రదర్శన ఉంటుంది. ఇక్కడ 3 లక్షల 26 వేల మందితో యోగా చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే మొత్తం 5 లక్షల మంది పాల్గొననున్న యోగా కార్యక్రమం ద్వారా విశాఖ నగరంలో గిన్నిస్ బుక్ రికార్డు నెలకొల్పేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందిని ఈ యోగా ప్రదర్శనలో భాగం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ కార్యక్రమంలో 25 వేల మంది విద్యార్థులు 108 సూర్య నమస్కారాలు చేస్తారు. వీటన్నింటికీ విశాఖ వేదికగా మారనుంది. ఇది రాష్ట్రానికి దక్కిన అపూర్వ గౌరవం, అందరూ దీనిలో భాగం కావాలి. 14 సంవత్సరాలు పైబడినవా రంతా కార్యక్రమంలో పాల్గొననుండగా, దూరప్రాంతాల నుంచి వచ్చే వారికోసం రవాణా, భోజన వసతి, బస, మరుగుదొడ్ల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశాం. ఇప్పటికే కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. ఎవరికీ ఇబ్బంది కలగకుండా నిర్ధిష్ట సమయానికి అంటే తెల్లవారుజామున 5 గంటలకే కార్యక్రమ ప్రాంగణాలకు చేరేలా చర్యలు తీసుకున్నాం. ఈ కార్యక్రమ విజయవంతానికి వాలంటీర్లు, సిబ్బంది కట్టుబడి ఉండాలి" అని తెలిపారు. మీడియా ఈ కార్యక్రమ విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి కోరారు. "యోగా అనేది జీవితంలో ఒక భాగంగా మారాలని, అందరు ప్రజలు దీన్ని ఆచరించాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ఆ సందేశాన్ని ప్రపంచా నికి ఇవ్వాలనే ఉద్దేశంతోనే విశాఖ వేదికగా ఎంపిక చేశాం," అని మంత్రి బాలవీరాంజనేయ స్వామి స్పష్టంచేశారు.

# తోటి కార్మికుని కుటుంబానికి అండగా సొసైటీ ఒకరోజు వేతనం

- షిప్ట్ యార్డ్ ఇన్టెక్ యూనియన్ ప్రధాన కార్యద ర్శి పి.శ్రీరామమూర్తి



**ములగాడ, పెన్ పవర్, జూన్ 18** :హిందుస్థాన్ షిప్ యార్డ్ మాజీ సొసైటీ కార్మికు డు బీశెట్టి శ్రీనివాసరావు ఇటీవల అకాల మరణం చెందటంతో ఆ కుటుంబానికి సొసైటీ కార్మికులు ఒకరోజు వేతనాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. శ్రీరామమూర్తి, ఇతర యూనియన్, సొసైటీ నాయకుల చేతుల మీదుగా ఒక రోజు వేతనం సేకరించిన రూ.1,75,953 మొత్తాన్ని చెక్ గా అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు అల్లాడ గోవింద్, భాస్కర పాడీ, కన్వీనర్ యువి రావ్, నల్లా నాగరాజు ఇతర సొసైటీ ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర విజయానికి సమాయత్తం - కార్పొరేటర్ డా. కందుల నాగరాజు




**విశాఖ దక్షిణం పెన్ పవర్ జూన్ 18**:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమం ఈ నెల జూన్ 21 (శనివారం)జరగనుంది. ఈ కార్యక్రమానికి భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర డిప్యూటీ సీఎం శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు.

ఈ నేపథ్యంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు, జనసేన పార్టీ నాయకులు, జీవీఎంసీ కార్పొరేటర్ డాక్టర్ శ్రీ కందుల నాగరాజు ఆర్పీలు, వార్డు సెక్రటరీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డా. నాగరాజు మాట్లాడుతూ -'ఈ కార్యక్రమం రాష్ట్ర గౌరవాన్ని పెంచే చారిత్రాత్మక సందర్భం. మన రాష్ట్రానికి, ప్రజల ఆరోగ్యానికి ఈ యోగా ఉద్యమం ఎంతో ముఖ్యమైనది. మనం పార్టీ శ్రేణులుగా ఈ కార్యక్రమాన్ని ఘనవంతం చేయాలి" అని తెలియజేశారు. ప్రజల భాగస్వామ్యంతో, సమన్వయంతో, సమయపాలనతో యోగాంధ్రను జయప్రదం చేయాల్సిన బాధ్యత మనందరిదని ఆయన పిలుపునిచ్చారు.

# వ్యవసాయశాఖ అధికారిగా మురళికృష్ణ

- బుధవారం బాధ్యతలు స్వీకరణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 18.** ముంచంగిపుట్టు మండల నూతన వ్యవసాయ శాఖ అధికారిగా జి మురళీకృష్ణ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలో గతంలో వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నా ఆయన ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలానికి వ్యవసాయశాఖ అధికారిగా బదిలీపై వచ్చారు. బుదవారం పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. మండల రైతులకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తిస్తానాన్ని అన్నారు. ఇప్పటివరకు ముంచంగిపుట్టు వ్యవసాయశాఖ అధికారిగా పనిచేసిన ఏం శ్రీనివాస్ బాబును ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా పొందూరు మండల వ్యవసాయశాఖ అధికారిగా బదిలీ చేశారు. నూతన వ్యవసాయ అధికారి మురళికృష్ణకు వ్యవసాయ శాఖ సిబ్బంది పూలబొకేలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోస్ వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అరకు నుంచి లోతేరుకు ఆర్టీసీ బస్సు

**పునఃప్రారంభించిన ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర**






**అరకులోయ పెన్ పవర్ 18**:తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుంచి గిరిజన ప్రాంతంలో నూతన సర్వీసుల ప్రారంభోత్సవానికి గట్టిగానే కసరత్తులు చేస్తున్నట్లు కనిపిస్తుంది. మంగళవారం రెండు ప్రాంతాలకు నూతన సర్వీసులను ప్రారంభించిన దొన్ను దొర అరకు నుంచి లోతేరుకు బుధవారం మరోసారి సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులను స్వయంగా చూశారని తాను కూడా ఎదుర్కొన్నానని ఈ విషయంలో ప్రతి ఒక్కరూ స్వీయ అనుభవాలు అనేకం ఉంటాయన్నారు. అందుకే గిరిజన ప్రాంతంలో ఏపీఎస్ఆర్టీసీ సర్వీసులను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దానిలో భాగంగానే నిన్న పాడేరు నుంచి బంధమామిడికి, చీకుమద్దె నుంచి పాడేరుకు రెండు బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. తాజాగా లోతేరుకు మరో నూతన సర్వీసును ప్రారంభించామని పేర్కొన్నారు. ఆర్టీసీ కూడా పూర్తిస్థాయి సర్వే చేసిన తర్వాత అవసరం ఉందనుకుంటే కచ్చితంగా అక్కడ నూతన సర్వేసిన ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రారంభోత్సవం అనంతరం ఆయన స్వయంగా టికెట్ తీసుకొని బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో పాడేరు %=జ% డిపో మేనేజర్ ఉమామహేశ్వరరావు, అరకు వాలీ మండల పార్టీ ప్రెసిడెంట్ లోక్కోయి మహాదేవ్, పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, మాదల సర్పంచ్ వంతల శ్రీను వాస్, పెదలబుడు వైస్ సర్పంచ్ పాడి చందు నిర్మల, పెదలబుడు వార్డ్ మెంబెర్ కిముడు త్రినాథ్, మాజీ మండల ప్రెసిడెంట్ శెట్టి బాబురావు, మాజీ ఎంపిటిసి కిల్లో కుమార్, మాజీ ఎంపిటిసి బోరి బోరి లక్ష్మి, వార్డ్ మెంబెర్ సోన్నాయి గంగ, మాజీ ఎంపీటీసీ అమ్మన్న, మాజీ సర్పంచ్ పెట్టెలి రాము, తెలుగు దేశం పార్టీ నాయకురాలు పొండోయ్ పద్మపురం సరస్వతి, శెట్టి లక్ష్మి, తెలుగు దేశం నాయకులు పాడి చందు, మోస్య నగేష్, బీజేపీ నాయకుడు కిల్లో ఆనంద్, జనసేన నాయకులు ఆర్టిసి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# యోగాంధ్ర కు తరలిరండి

- 11వ వార్డు లో అంతర్జాతీయ యోగా దినోత్సవ అవగాహన ర్యాలీ




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూన్ 18:** 11వ వార్డ్ 18 వ సచివాలయం పరిధి అన్నా నగర్, తోట గరువు కాలనీ, తోట గరువు, ప్రాంతాలలో ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీని వార్డ్ కూటమి ప్రభుత్వ నాయకులు నిర్వహించారు.ఈ ర్యాలీలో 11వ వార్డ్ టిడిపివార్డ్ ఇంచార్జ్ అచ్యుత్ రావు,వార్డ్అధ్యక్షులు ముగడ రాజారావు. కార్యదర్శి నాయుడు,జనసేన వార్డు అధ్యక్షులు సారి పిల్లి రాము టిడిపి సీనియర్ నాయకులు ఎం. కృష్ణంరాజు, మూది అప్పారావు, ఆదినారాయణ రాజు. మంగరాజు. సింహాద్రి శేఖర్.కొల్లి ఎర్రాజీ రావు,శ్రీను గారు, మన్యాల రమణ అప్పారావు.మరియు18 వ సచివాలయం సిబ్బంది అడ్మిన్ జ్యోష్ణ.వాసంతి .పవన్, ఆర్ పి లు మన్యాల లక్ష్మి, రమణమ్మ, పొదుపు సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

## ఈనెల 21వ తేదీన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.



**పాయకరావుపేట పెన్ పవర్ జూన్ 18.** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21వ తేదీన యోగాంధ్ర కార్యక్రమం తలపెట్టిందని ప్రజలంతా యోగాంధ్రంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెంచలపు పద్దు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హెూమ్ మంత్రి వంగలపూడి అనిత పాల్గొంటున్నారని రాష్ట్ర ప్రజలు అలాగే పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.

# ఇదో గేమ్ ఛేంజర్



**పెన్ పవర్ జూన్ 18**జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఉపశమనం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్ట్ ట్యాగ్ వార్షిక పాస్ వ్యవస్థ పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన ఈ కీలక ప్రకటనను ఆయన స్వాగతించారు. ప్రయాణికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ పాస్ విధానం రహదారి ప్రయాణాల్లో గణనీయమైన మార్పు తీసుకురాబోతుందంటూ పవన్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో స్పందించారు.

రూ.3000తో సంవత్సరం పొడవునా ప్రయాణ సౌలభ్యం

పవన్ కళ్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొంటూ, ఈ పాస్ వ్యవస్థ టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడమే కాకుండా, వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై తరచూ ప్రయాణించే వ్యక్తులకు ఇది సమయ, ధన వ్యయాన్ని తగ్గించనుందని పేర్కొన్నారు.

**కేంద్రానికి కృతజ్ఞతలు – ఇది ప్రజాపాలనకు నిదర్శనం**

ఈ నిర్ణయంతో ప్రయాణికుల డిమాండ్‌కు సరైన పరిష్కారం లభించిందని పవన్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజాపాలన పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఇది ప్రతీక అని పవన్ కళ్యాణ్ కొనియాడారు.

**మార్గదర్శకాలు ఇంకా విడుదల కావలసిన పరిస్థితి**

ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్‌లు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఈ పాస్ ద్వారా దేశవ్యాప్తంగా హైవే ప్రయాణాల్లో మరింత వినూత్నత, వేగం, సౌలభ్యత తీసుకురావడం లక్ష్యంగా ఉందని గడ్కరీ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

అయితే, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతానికి కార్లు, జీపులు, వాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే వర్తించేలా ఈ పాస్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, నిబంధనలు ఇంకా వెల్లడించాల్సి ఉంది.

# నేటికీ తెరుచుకోని పాఠశాల - విద్యార్థులు చదువుకు దూరం

- జర్రిపడ జిపిఎస్ పాఠశాల 45 మంది విద్యార్థుల పరిస్థితి గాలిలో దీపం.
- విద్యశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తుల డిమాండ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 18.**మండల పరిధిలో గల పెదగూడ పంచాయతీ జర్రిపడ జిపిఎస్ పాఠశాల పున ప్రారంభం నుండి ఉపాధ్యాయులులేక నేటికీ తెరుచుకోకపోవడంతో విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన చేసేవారులేక చదువుకు దూరమయ్యే ప్రమాదం నెలకొని ఉంది. జర్రిపడ జిపిఎస్ పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడికి ప్రమోషన్ రావటంతో గత ఏప్రిల్ నెలలోనే బదిలీపై వెళ్లారు. దీంతో మాతృభాష విద్యా వాలంటీర్ సుమారు 45 మంది విద్యార్థులకు విద్యాబోధన చేసేవారు. ప్రభుత్వం జర్రిపడలో ఉపాధ్యాయుని నియమించకపోవడంతో పాటు మాతృభాష విద్యా వాలంటరీ రెన్యూవల్ చేయకపోవడంతో ఈనెల 12వ తేదీ నుండి తెరచ్చుకోవాల్సిన పాఠశాల19 తేదీ వస్తున్నప్పటికీ తెరుచుకోలేదు. ప్రభుత్వం ఐటిడిఏ అధికారులు స్పందించకపోవడంతో గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుందని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే జరిపాడ జిపిఎస్ పాఠశాలలో ప్రత్యమ్నయంగా ప్రక్క పాఠశాల ఉపాధ్యాయుడు లేదా విద్యా వాలంటీర్లను తక్షణమే రెన్యూవల్ చేసి గిరిజన విద్యార్థులకు విద్య దూరం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జరిపాడ గ్రామ పాఠశాల మాత్రమే కాకుండా మండలంలో మరి కొన్ని పాఠశాలలు ఈ దుస్థితిలో ఉందనీ సమాచారం. వీటిపై విద్యశాఖ ఎటువంటి చర్య తీసుకుంటుందో వేచి చూడాలి.

# ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఏమైపోయారు?

**మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ**



**పశ్చిమగోదావరి: పెన్ పవర్ జూన్ 18** కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు మోసపోయారని.. రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగిన ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఏమైపోయారంటూ మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ నిలదీశారు. బుధవారం ఆయన “జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం” పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఏపీలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి లోకేష్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారంటూ మండిపడ్డారు.

“చంద్రబాబు 1 లక్ష 50 కోట్ల రూపాయలు అప్పు తెచ్చి తమ యంత్రాంగానికి దోచిపెడుతున్నారు. యువగళం పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ ఇస్తానన్న లోకేష్ ఆ హామీ మరిచిపోయారా?. తల్లికి వందనం పథకంపై కూటమి నాయకులు డబ్బులు కోరుకుంటున్నారు. ఏడాది కూటమి పాలనలో స్త్రీ శక్తి పథకం డబ్బులు ఎవరికీ వేశారు?. రాష్ట్ర మహిళలు ఉచిత బస్సులో ప్రయాణిస్తున్నారా?. ఏ ఆగస్ట్‌లో ఈ ఉచిత బస్సు అమలు చేస్తారు?” అంటూ కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు.

“కూటమి పాలనలో వ్యవసాయ రంగంలో పూర్తిగా దెబ్బతింది. ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తారని రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. వైయస్ జగన్ హయాంలో డీబీటీ ద్వారా నేరుగా ప్రజల అకౌంట్‌లో డబ్బులు జమ చేసేవాళ్లం. పోలవరం ప్రాజెక్టు సృష్టికర్త వైయస్ఆర్‌పై కూడా విమర్శలు చేస్తున్నారు. 1 లక్ష 50 వేల కోట్లలో పోలవరానికి ఎంత కేటాయించారు?. మైనింగ్ కార్పొరేషన్‌లో గనులకు వచ్చే లక్షల కోట్ల రూపాయల మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్తున్నాయి” అని కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

“పిఠాపురంలో జనసేన కార్యకర్త అన్యాయన్నీ ప్రశ్నించాడని ఊరు నుంచి వెలివేస్తే పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేస్తే వీడియో కాల్‌లో పరామర్శిస్తారా?” అంటూ కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు.

# వైయస్ జగన్‌ను ఆంక్షలతో అడ్డుకోవాలని చూడడాన్ని ఎవరూ హర్షించరు

**కూటమి సర్కార్ తీరును ఎక్స్ వేదికగా ఎండగట్టిన వైయస్ఆర్‌సీపీ నేతలు**



**తాడేపల్లి: పెన్ పవర్ జూన్ 18** వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా పర్యటనను కూటమి ప్రభుత్వం ఆంక్షలతో అడ్డుకోవడాన్ని ఎవరూ హర్షించరు అంటూ వైయస్ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు. వైయస్ జగన్ ఇవాళ పల్నాడు జిల్లా పర్యటనకు వెళ్తున్న సందర్భంగా.. ఆయన పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. వైయస్ జగన్ పర్యటనపై పోలీసులు సాయంతో కూటమి సర్కార్ అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తోంది. వైయస్ జగన్ పర్యటనకు కేవలం వంద మంది మాత్రమే రావాలంటూ పోలీసులు ఆంక్షలు పెట్టారు. కేవలం మూడు వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తామని ఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు. అయితే, నిరసన, ధర్నా కాకపోయినా ఇలా.. పోలీసుల ఆంక్షలు విధించడంపై పార్టీ నేతలు ఎక్స్ వేదికగా సర్కార్ తీరును ఎండగట్టారు. వైయస్ఆర్‌సీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించే స్వేచ్ఛ కూడా లేదా అంటూ వైయస్ఆర్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల ద్వారా వైయస్ జగన్ పర్యటనను కూటమి సర్కార్ నియంత్రించే కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎక్స్ వేదికగా పార్టీ నాయకులు ఏమన్నారంటే..**

అధికారం శాశ్వతం కాదు: బాలసాని కిరణ్‌కుమార్

కూటమి ప్రభుత్వం వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న వైయస్ జగన్ గారిని ఆంక్షలతో అడ్డుకోవాలని చూడడాన్ని ఎవరూ హర్షించరు చంద్రబాబు గారూ. ఇప్పటికైనా కుట్రలు చేయడం ఆపండి. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోండి.కూటమి ప్రభుత్వం వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న వైయస్ జగన్ గారిని ఆంక్షలతో అడ్డుకోవాలని చూడడాన్ని ఎవరూ హర్షించరు చంద్రబాబు గారూ. ఇప్పటికైనా కుట్రలు చేయడం ఆపండి. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోండి.

ఇది ప్రజాస్వామ్యమా? రాక్షస రాజ్యమా?: దేవభక్తుని చక్రవర్తి

ద-పల్నాడు జిల్లా రెంటపాళ్లకు వెళ్తున్న వైయస్ జగన్ గారి అడ్డుకోవాలని కుట్రలు చేయడం ఏంటి చంద్రబాబు గారూ?. కూటమి ప్రభుత్వం వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి వైయస్ జగన్ గారు వెళ్తుంటే కొద్ది మంది మాత్రమే వెళ్లాలని ఆంక్షలు ఏంటి? ఇది ప్రజా స్వామ్యమా? రాక్షస రాజ్యమా?%–

**అడ్డుకోవాలని చూడడం మీ అవివేకం: కైలే అనిల్‌కుమార్**

కూటమి ప్రభుత్వ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని మా నాయకుడు వైయస్ జగన్ గారు వెళ్తుంటే అడుగడుగునా ఆంక్షలు పెట్టి, అడ్డంకులు సృష్టించడం మీకే చెల్లింది ఏ గారూజనాదరణ కలిగిన నాయకుడిని ఇలా పోలీసు యంత్రాంగాన్ని పెట్టి అడ్డుకోవాలని చూడడం మీ అవివేకం. జగన్ గారు జనం గుండెల్లో ఉన్నారు. అక్కడి నుంచి ఎవరూ తీయలేరు

**ఆంక్షలు పెట్టడం కరెక్టా? : దొంతిరెడ్డి వేమారెడ్డి**

%–%చంద్రబాబు గారూ, కూటమి ప్రభుత్వం వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న మా కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి మా నాయకుడు వైయస్ జగన్ గారు వెళ్తుంటే ఆంక్షలు పెట్టడం కరెక్టా? మూడు వాహనాల్లోనే వెళ్లాలి, 100 మందికే అనుమతి ఇస్తాం అనడం ఏంటి? ప్రజాదరణ కలిగిన నాయకుడిని ఇలా అడ్డుకుంటారా? ఇది ఏ మాత్రం మంచి పద్ధతి కాదు చంద్రబాబుగారూ –.

# తప్పుడు కేసులో అరెస్ట్ చేశారు



పోలీసులు తీరుపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆగ్రహం

**విజయవాడ: పెన్ పవర్ జూన్ 19**తనను పోలీసులు తప్పుడు కేసులో అరెస్టు చేశారని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి వరకు తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, ఒక్క సారి కూడా విచారణకు పిలవలేదని స్పష్టం చేశారు. నిన్నటి వరకు తన మీద ఎఫ్ ఐ ఆర్ కూడా లేదని తెలిపారు. నిన్న బెంగళూరులో లుక్ ఔట్ నోటీస్ అక్రమంగా ఇచ్చారని తప్పుపట్టారు. విచారణకు తాను సహకరిస్తానని ఆయన వెల్లడించారు. నిన్నటి వరకు నా మీద ఒక్క కేసు కూడా లేదని, అయిన తప్పుడు కేసులో అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. ఈరోజు కూడా విచారణ లో నా అభిప్రాయాన్ని తీసుకోలేదని ఆక్షేపించారు. తప్పుడు కేసులను ధైర్యంగా ఎదుర్కొంటానని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు.

# పోలీసుల అదుపులో కొడాలి నాని..



**కోల్‌కతా : పెన్ పవర్ జూన్ 18** మాజీ మంత్రి కొడాలి నానిదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోల్‌కతా నుంచి కొలంబో వెళ్తుండగా ఆయనను ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఏపీ లో నమోదైన కేసులో కొడాలి నానిపై లుకౌట్ నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే. దీంతో కోల్‌కతా ఎయిర్ పోర్టులో కొడాలి నానిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

కాగా కొడాలి నాని తీవ్ర అనారోగ్యంతో కొద్ది రోజులు హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. అనంతరం ముంబై ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్‌లో చేరారు. ఆ తర్వాత ఆయనకు గుండె సంబంధింత సర్జరీ చేశారు. ముంబైలో ఉన్నారని, త్వరలోనే రాష్ట్రానికి వస్తారని వైసీపీ నేతలు తెలిపారు. అయితే ఆయన కోల్‌కతా వెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉంటే జగన్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన కొడాలి నాని రెచ్చిపోయి మాట్లాడేవారు. ప్రతిపక్ష నాయకులను దూషించేవారు. దీంతో అప్పట్లోనే ఆయనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల ఆయనపై పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొంతకాలంగా కొడాలి నాని రాష్ట్రంలో ఉండకపోవడంతో ఆయనపై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు దేశంలోని అన్ని ఎయిర్ పోర్టులకు సమాచారం అందించారు. ఇందులో భాగంగా తాజాగా కోల్‌కతా ఎయిర్ పోర్టులో కొడాలి నానిని అదుపులోకి తీసుకున్నారు.

# ఆంక్షలు పెట్టి ప్రజాదరణ కలిగిన నాయకుడిని అడ్డుకోవడం కరెక్ట్ కాదు

**మాజీ మంత్రి ఆర్కే రోజా**



**చిత్తూరు: పెన్ పవర్ జూన్ 18** వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు పర్యటన వేళ పోలీసులు ఆంక్షలు విధించడం పట్ల మాజీ మంత్రి ఆర్కే రోజా స్పందించారు. ఆంక్షలు పెట్టి ప్రజాదరణ కలిగిన నాయకుడిని అడ్డుకోవడం కరెక్ట్ కాదంటూ ఆమె తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

**ఎక్స్ వేదికగా ఆర్కే రోజా..**

మీ ప్రభుత్వ వేధింపులు భరించలేక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే, ఆయన కుటుంబాన్ని వైయస్ జగన్ గారు పరామర్శించడానికి వెళ్లడం తప్పా చంద్రబాబు గారూ? మీ పార్టీ కార్యర్తలు చనిపోయినప్పుడు మీరు వెళ్లి ఆ కుటుంబాలను పరామర్శించలేదా? ఆంక్షలు పెట్టి ప్రజాదరణ కలిగిన నాయకుడిని అడ్డుకోవాలని చూడడం ఏ మాత్రం కరెక్టు కాదు చంద్రబాబు గారూ..–అంటూ రోజా ట్వీట్ చేశారు.

# హనీమూన్ మర్డర్ కేసు : కాల్ డేటా లీక్: హత్యకు ముందు 119 సార్లు ఫోన్ సంభాషణలు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో ఊహించని మలుపు చోటుచేసుకుంది. రాజా రఘువంశీ హత్య కేసు దర్యాప్తులో ఇంతవరకు బయటపడని మరో వ్యక్తి పేరు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు సోనమ్, హత్యకు ముందు సంజయ్ వర్మ అనే వ్యక్తితో 119 సార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**హత్యకు ముందే 119 సార్లు సంజయ్‌తో సంభాషణ!**

పోలీసులు సోనమ్ యొక్క కాల్ డేటా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించగా మార్చి 1 నుంచి మార్చి 25 మధ్య ఆమె సంజయ్ వర్మ అనే వ్యక్తితో ఏకంగా 119 సార్లు మాట్లాడినట్లు గుర్తించారు. ప్రస్తుతం సంజయ్ మొబైల్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది. ఈ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణల నేపథ్యంలో ఈ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి రావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. త్వరలోనే సంజయ్ వర్మను గుర్తించి ప్రశ్నించనున్నట్లు సమాచారం.

**హనీమూన్ ట్రిప్‌లో ఘోర దారుణం**

మే 23న మేఘాలయలోని తూర్పు ఖాసీ హిల్స్ ప్రాంతంలోని వీ సావ్‌డాంగ్ జలపాతం సమీపంలో రాజా రఘువంశీ హత్యకు గురయ్యాడు. జూన్ 2న అతడి మృతదేహాన్ని లోయలో గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు సోనమ్ జూన్ 8న ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ పోలీసులకు లొంగిపోయింది.

**హత్యకు సహకరించిన హంతకులు**

పోలీసుల విచారణలో మరో కీలక విషయం బయటపడింది. హంతకుల్లో ఒకరైన విశాల్ సింగ్ ఇచ్చిన సమాచారంతో రాజా రఘువంశీపై కత్తితో దాడి చేసి చంపినట్టు వెల్లడించాడు. హత్య సమయంలో సోనమ్ అక్కడే ఉండి దాడిని ప్రత్యక్షంగా చూసిందని తెలిపాడు. రాజా కేకలు వేయడంతో సోనమ్ అక్కడి నుంచి పారిపోయిందని, ఆ తర్వాత హంతకులు మరిన్ని దాడులు చేసి అతన్ని హత్య చేసినట్టు విశాల్ వివరించాడు.

**దర్యాప్తులో మరిన్ని మలుపులు?**

ఈ కేసులో సంజయ్ వర్మ పేరు బయటపడటంతో దర్యాప్తు మరో మలుపు తిరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# దేశమంతా కేవలం రూ.3వేలతో తిరగండి!




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం వాహనదారులకు ఒక గొప్ప శుభవార్తను వెల్లడించింది. ఈసారి స్వాతంత్ర దినోత్సవ కానుకగా ఫాస్టాగ్ ఆధారిత కొత్త వార్షిక పాస్ ను పరిచయం చేయనుంది. కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల దీనికి సంబంధించిన వివరాలను తెలియజేశారు.

**ఆగస్టు 15 నుంచి అమల్లోకి.. దేశమంతా కేవలం ?3,000తో ప్రయాణం!**

ఆగస్టు 15, 2025 నుంచి అమలులోకి రానున్న ఈ స్కీమ్ ద్వారా వాహనదారులు ?3,000 చెల్లించి వార్షిక పాస్ పొందవచ్చు. ఈ పాస్‌తో దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై ఏదైనా టోల్ ప్లాజా వద్ద ఏకంగా 200 ట్రిప్పులు లేదా 1 సంవత్సరం కాలవ్యవధి ఏది ముందుగా పూర్తి అయినా సరే ప్రయాణించవచ్చు. ఈ పాస్ ప్రత్యేకంగా కార్లు, జీపులు, వ్యాన్ల వంటి వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాల కోసం రూపొందించబడింది.

**ప్రయాణదారులకు ప్రయోజనాలు ఇవే:**

ఈ కొత్త విధానం వల్ల ప్రయాణదారులకు అనేక ప్రయోజనాలు లభించనున్నాయి. తక్కువ ఖర్చుతో దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణానికి అయ్యే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. టోల్ ప్లాజాల వద్ద ఎక్కువ సమయం నష్టపోకుండా వేగంగా ప్రయాణించగలుగుతారు. 60 కిలోమీటర్ల పరిధిలో ఉన్న టోల్ ప్లాజాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందిటోల్ ప్లాజాల వద్ద జరిగే చెల్లింపుల వివాదాలు తగ్గుతాయి.రద్దీ తగ్గి సమయం ఆదా అవుతుంది.

**ఎలా యాక్టివేట్ చేసుకోవాలి?**

ఈ స్కీమ్‌ను వినియోగించుకోవాలనుకునే వారు త్వరలో NHAI, MoRTH అధికారిక వెబ్‌సైట్లు లేదా రాజ్‌మార్గ యాత్ర యాప్ ద్వారా యాక్టివేషన్, పునరుద్ధరణ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో సులభంగా అందుబాటులో ఉంటుంది. ఈ పాస్ వల్ల దేశంలోని లక్షలాది వాహనదారులకు ప్రయోజనం కలగనుందని, వారి ప్రయాణ అనుభవం మరింత వేగవంతం, సౌకర్యవంతం కానుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. మొత్తంగా చెప్పాలంటే ఈ కొత్త వార్షిక పాస్ పథకం వాహనదారులకు ఆర్థిక ప్రయోజనాలను అందించడమే కాకుండా, ప్రయాణ సమయంలో ఎదురయ్యే అవాంతరాలను కూడా నివారించనుంది. టోల్ గేట్ల వద్ద వేచి ఉండే అవసరం లేకుండా నిరవధిక ప్రయాణానికి ఈ పాస్ దోహదం చేయనుంది.

# ‘తల్లికివందనం’ ఫైనాన్స్ కంపెనీల పంగ నామం!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ‘తల్లికివందనం’ కార్యక్రమానికి కొన్ని ఫైనాన్సు కంపెనీలు పంగనామం పెడుతున్నాయి. ఈ పథకం కింద తల్లుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిన డబ్బును ఫైనాన్స్ కంపెనీలో ఖాళీ చేస్తున్నాయి. ఎప్పుడో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించినా, ఏవేవో కారణాలతో తమ అకౌంట్ల నుంచి డబ్బు లాగేస్తున్నారని కొంత మంది మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వం డబ్బు ఇచ్చిందన్న ఆనందం లేకుండా చేస్తున్న ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు ఫైనాన్స్ కంపెనీల నిర్వాకంతో ప్రభుత్వానికి రావాల్సిన మంచిపేరు దక్కడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

‘తల్లికి వందనం’లో తమ అకౌంట్లకు జమ అయిన డబ్బులు ఓ ఫైనాన్స్ కంపెనీ లాగేసిందని అనంతపురం జిల్లాలో పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయి. గుంతకల్లు పట్టణంలోని పలువురు మహిళలు పోలీసులను ఆశ్రయించి తమ అకౌంట్ల నుంచి డబ్బు లాగేసిన ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఓ ఫైనాన్స్ కంపెనీ వద్ద టీవీ, ఫ్రిడ్జ్ వంటివి కొనేందుకు ఫైనాన్స్ తీసుకున్నామని, ఈఎంఐలు అన్నీ చెల్లించినా, తమ అకౌంట్లలో జమ అయిన మొత్తం డబ్బును అన్యాయంగా తీసుకున్నారని మహిళలు ఫిర్యాదు చేశారు.ఓ మహిళ టీవీ కొనుగోలు చేసి ఈఎంఐ చెల్లించలేదని, అయితే సదరు ఫైనాన్స్ కంపెనీ వారు టీవీని అప్పట్లోనే రికవరీ చేశారట. కానీ, ఇప్పుడు ఆమె అకౌంట్లో తల్లికి వందనం డబ్బు పడగానే ఆ మొత్తాన్ని తీసుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. చదువు రాని వారి పేరున రుణాలిచ్చి ఏళ్లుగా డబ్బు వసూలు చేస్తున్నారని ఆ ఫైనాన్స్ కంపెనీపై మహిళలకు ఫిర్యాదు చేశారు.



# అమరావతి ఎందాకా వచ్చింది? నారా లోకేష్ కు ఉపరాష్ట్రపతి ప్రశ్న



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌లో టీడీపీ యువనాయకుడు, మంత్రి నారా లోకేష్ బుధవారం ఉదయం భేటీ అయ్యారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్.. మర్యాద పూర్వకంగానే ఉపరాష్ట్రపతితో భేటీ అయ్యారని తెలుస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మరింత వేగవంతమైన అభివృద్ధికి సహాయ, సహకారాలను అందించాలని కోరినట్టు తెలిసింది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అందునా అమరావతిలో ‘క్వాంటమ్ వ్యాలీ’ని ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా నారా లోకేష్ ఉపరాష్ట్రపతికి వివరించారు. దీనికి ఉపరాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని ప్రశంసలు గుప్పించారు. అదే సమయంలో రాజధాని పనులు ఎందాకా వచ్చాయని ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారని తెలిసింది. రూ.64 వేల కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, పనులు వేగంగా పూర్తిచేస్తున్నామని లోకేష్ చెప్పా రు. ఈ నెల 21వతేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ప్రధాని నరేంద్రమోడీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమంతో చరిత్ర సృష్టించబోతోందని చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశానికి గత 40 ఏళ్లలో ఎప్పుడూ గెలవని మంగళగిరిని తాను ఎంచుకున్నానని లోకేష్ చెప్పగా, తాను కూడా తొలిసారి పరిచయం లేని నియోజకవర్గాన్నే ఎంచుకొని పోరాడానని ఉపరాష్ట్రపతి తన పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా 226 రోజులపాటు 3,132 కి.మీ.ల మేర తాను చేసిన పాదయాత్రలో ఎదురైన అనుభవాలను కళ్లకుకడుతూ రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశారు. పాదయాత్ర ద్వారా ఎపి ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేష్ ను ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా అభినందించారు. ఈ చర్చల్లో జగన్ ప్రస్తావన కూడా వచ్చినట్టు తెలిసింది. జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించినట్టు సమాచారం. అయితే.. పొదిలి ఘటనతోపాటు అమరావతి మహిళలపై చేసిన విమర్శలను ఈ సందర్భంగా నారాలోకేష్ వివరించినట్టు తెలిసింది.

# ఇదేంది జగనన్నా: వెళ్తోంది పరామర్శకు.. చేస్తోంది ఎన్నికల ప్రచారమా?!



**హైదరాబాద్ పెన్ పవర్:** స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లిలాంటిదే బ్రదర్.. అన్నారు ఆత్రేయ. అలానే ఉంది వైసీపీ అధినేత జగన్ పర్యటన పనితీరు. గతంలో వైఎస్ మరణించినప్పుడు ఆయన లేరన్న వార్త తెలిసి కొందరు మృతి చెందారు. అప్పట్లో కూడా.. జగన్ ఏడాది ఆగి ఓదార్పు యాత్రల పేరిట ఉమ్మడి రాష్ట్రంలో పర్యటించారు. కానీ.. ఓదార్పు యాత్రలను ఎన్నికల యాత్రలుగా నిర్వహించడంతోనే కాంగ్రెస్‌లో కొందరు పెద్దలు విభేదించారు. ఇదే ముసలానికి దారి తీసింది. అయితే.. ఇప్పుడు సొంత పార్టీ పెట్టుకున్నా.. జగన్ తన తీరును మార్చుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. వైసీపీకి చెందిన చాలా మంది దీనిని సమర్థిస్తున్నా.. మరికొందరు మాత్రం %--%ఇది బాలేదు!%--% అని పెదవి విరుస్తున్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్లలో నాగమల్లేశ్వరరావు అనే వైసీపీ మాజీ నాయకుడు ఒకరు 2024 ఎన్నికల తర్వాత.. బలవన్మరణానికి పాల్పడ్డారు. కొన్నాళ్ల కిందట ఆయన సంవత్సరీకం కూడా అయిపోయింది.అయితే.. ఇప్పుడు ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ బయలు దేరారు. సరే..ఎవరిని ఎప్పుడు పరామర్శించాలనేది జగన్ ఇష్టం. కానీ.. ఈ చావుకు సంబంధించిన పరామర్శను కూడా.. ఓ వేడుకగా.. ఎన్నికల ప్రచారంగా మార్చడమే ఇప్పుడు విమర్శలకు దారితీసింది. ప్రత్యర్థుల విమర్శలు ఎలా ఉన్నా.. సొంత పార్టీలోనే కీలక నాయకులు దీనిని విమర్శిస్తుండడం గమనార్హం. ఇదేంది జగనన్నా.. అంటూ.. కొందరు పెదవి విరుస్తున్నారు. జగన్ ఇంటి నుంచి రెంటపాళ్లకు 72 కిలో మీటర్లు.. కానీ.. దీనిని యాత్ర మాదిరిగా మార్చడంతో ఒక్కొక్క కిలో మీటరు ప్రయాణించేందుకు జగన్ సొంత మీడియా కథనం మేరకు గంటకు పై గా పడుతోంది. ఉదయం 9.30 గంటలకు ప్రారంభించిన ఈ పరామర్శ యాత్ర.. మధ్యాహ్నం 1 గంట సమయానికి కేవలం 40 కిలో మీటర్లు మాత్రమే చేరింది. అంటే.. ఈ పరామర్శ యాత్రను కూడా.. తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ.. ఇలాంటి యాత్రలు చేయాల్సి వచ్చినప్పుడు నేరుగా ఆ కుటుంబాలను కకలుసుకునేందుకు ఆయన ఒక్కరు లేదా ఓ పదిమంది వెళ్తే సరిపోతుంది. కానీ.. ఎన్నికల అనంతరంకూడా.. తన హవా తగ్గలేదని నిరూపించుకునే క్రమంలో జగన్ చేస్తున్న హడావుడిగా నాయకులు భావిస్తున్నారు.

# జగన్ కాన్వాయ్ ఢీకొట్టలేదు.. క్లారిటీ ఇచ్చిన ఎస్పీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ సీఎం జగన్ సత్తెనపల్లి పర్యటనలో ఎటువంటి అపశృతి చోటుచేసుకోలేదని గుంటూరు ఎస్పీ సతీశ్ కుమార్ వెల్లడించారు. తాడేపల్లి నుంచి సత్తెనపల్లి వెళుతున్న జగన్ కాన్వాయ్ గుంటూరు బైపాస్ వద్ద ఏటుకూరు జంక్షన్ లో వృద్ధుడు సింగయ్యను ఢీకొట్టిందని, ఆ ప్రమాదంలో ఆయన మరణించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీనిపై అధికార పార్టీ టీడీపీ కూడా ట్విట్టర్ లో స్పందించింది. ‘ఇంకా ఎంత మందిని బలితీసుకుంటావ్’ అంటూ జగన్ ను ప్రశ్నించింది. అయితే ఈ ఘటనపై గుంటూరు ఎస్పీ సతీశ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ప్రమాదానికి జగన్ కాన్వాయ్ కి సంబంధం లేదంటూ ఎస్పీ స్పష్టం చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్లలో మాజీ ఉప సర్పంచ్ నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణకు వెళుతున్న జగన్ కాన్వాయ్ ఢీకొనడంతో సింగయ్య అనే వృద్ధుడు మరణించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేయగా, ప్రమాదానికి జగన్ కాన్వాయ్ కారణం కాదని తేలిందని ఎస్పీ సతీశ్ కుమార్ వెల్లడించారు. సింగయ్యను %ూా26జజు%0001 నెంబరు గల టాటా సఫారీ వాహనం ఢీకొట్టినట్లు ఎస్పీ సతీశ్ కుమార్ తెలిపారు. సింగయ్యను ఢీకొట్టిన తర్వాత వాహనం డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లిపోయినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హైవే పెట్రోలింగ్ ఎస్ఐ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన 108కి ఫోన్ చేసి గుంటూరు జీజీహెచ్ కి తరలించినట్లు ఎస్పీ తెలిపారు. అయితే తీవ్ర గాయాలు కావడంతో సింగయ్యను గుంటూరు తరలించేలోపే మరణించినట్లు ఎస్పీ వెల్లడించారు. సింగయ్య కుటుంబం ఫిర్యాదు చేస్తే వాహనం డ్రైవర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని తెలిపారు. సింగయ్య మరణానికి జగన్ కాన్వాయ్ కి సంబంధం లేదని ఎస్పీ స్పష్టం చేశారు. కాగా, జగన్ పర్యటనలో సత్తెనపల్లిలో మరొకరు మరణించారని వార్తలు వస్తున్నాయి. సత్తెనపల్లి గడియారం స్తంభం వద్ద జరిగిన తోపులాటలో ఆటోనగర్ కి చెందిన పాపసాని జయవర్ధన్ రెడ్డి సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మరణించినట్లు చెబుతున్నారు.

# ట్రంప్ వార్నింగ్.. ఇజ్రాయెల్ కు ‘హైపర్’ సోనిక్ మిస్సైల్ తో రిప్లై పంపిన ఇరాన్!



**హైదరాబాద్ పెన్ పవర్:** సోకాల్డ్ సుప్రీం లీడర్ (ఖమేనీ) ని చంపడం పెద్ద పనేమీ కాదని.. బేషరతుగా లొంగిపోవాలని డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన కొన్ని గంటలకు ఇరాన్ నుంచి ‘ఎక్స్’ వేదికగానే కాకుండా.. వార్ ఫీల్డ్ లోనూ సమాధానం వచ్చేసింది. ఇందులో భాగంగా... ఇజ్రాయెల్ పై వ్యూహాత్మకంగా దాడి చేస్తోన్న ఇరాన్.. బుధవారం తెల్లవారుజామున రెచ్చిపోయింది. హైపర్ సోనిక్ క్షిపణులతో విరుచుకుపడింది.

అవును... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బేషరతుగా లొంగిపోమని వార్నింగ్ ఇచ్చిన కొన్ని గంటలకు ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి ఎక్స్ వేదికగా రిప్లై వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... “నమీ పేరుతో యుద్ధం మొదలైంది. అలీ తన జాల్ఫికర్ తో కలిసి ఖైబర్ కు వచ్చేశారు” అని అందులో రాశారు. దీంతోపాటు ఖడ్గం చేతబట్టి కోట గేటు వద్ద ఓ వ్యక్తి ఉన్న ఫోటోను దీనికి జతచేశారు.ఇలా “యుద్ధం మొదలైంది” అనే రిప్లై ను మాటల్లో ఇచ్చిన ఇరాన్... బుధవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ పై చేతల్లోనూ సమాధానం ఇచ్చేసింది. ఇందులో భాగంగా.. ఇజ్రాయెల్ లో 10 చోట్ల హైపర్ సోనిక్ క్షిపణులతో దాడులకు తెగబడింది. ఈ విషయాన్ని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఓ ప్రకటనలో ధృవీకరించింది. దీంతో... ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్ర స్థాయికి చేరాయి.ఇజ్రాయెల్ లోని 10 లక్ష్యాలపై ఫతాహ్-1 హైపర్ సోనిక్ బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించిన ఇరాన్... ‘ఆపరేషన్ హానెస్ట్ ప్రామిస్ - 3’లో 11వ దశ కొనసాగుతోందని వెల్లడించింది. ఇదే సమయంలో ఆక్రమిత భూభాగాల గగనతలంపై పూర్తి నియంత్రణ సాధించామని ప్రకటించింది. ట్రంప్ వార్నింగ్ అనంతరం “యుద్ధం మొదలైంది” అని ఖమేనీ ప్రకటించిన అనంతరం ఇరాన్ ఈ దాడి చేసింది.దీంతో... ఇజ్రాయెల్ ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. ప్రజలను అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగా.. సెంట్రల్ ఇజ్రాయెల్, వెస్ట్ బ్యాంక్ శరణార్థి శిబిరాల్లో అలర్ట్ జారీ చేసింది. మిస్సైళ్ల దాడి జరుగుతున్నందున ప్రజలు తక్షణమే ఆయా ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించింది.కాగా... ఇరాన్ వద్ద ఉండే అత్యంత పవర్ ఫుల్ ఆయుధాల్లో ఈ ఫతాహ్-1 హైపర్ సోనిక్ మిస్సైల్ ఒకటి. ధ్వని కంటే సుమారు 15 రెట్లు వేగంగా దూసుకెళ్లే ఈ క్షిపణి.. 1400 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగలదు. అది కూడా 4 నిమిషాల్లోనే కావడం గమనార్హం!

# డసాల్ట్ సంస్థతో అనిల్ అంబానీ కంపెనీ డీల్.. ఫాల్కన్ జెట్స్ తయారీ.. దూసుకుపోతున్న స్టాక్



**హైదరాబాద్ పెన్ పవర్:** అనిల్ అంబానీ ఇదొక ఫెయిల్డ్ బిజినెస్ మెన్ స్టోరీ అంటూ గతంలో వార్తలు వచ్చేవి. కానీ ప్రస్తుతం ఆయన ప్రయాణం లక్షల మంది యువ వ్యాపారవేత్తలకు మార్గదర్శకంగా మారుతోంది. పడటం కాదు దాని నుంచి తిరిగి ఎలా లేవాలి, ఎలా నిలదొక్కుకోవాలి అనే అంశాలను అనిల్ జీవితం అందిస్తోంది. వ్యాపారవేత్తగా తన రెండవ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన అంబానీ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులు, విజయాలతో ముందుకు సాగుతున్నారు. తాజాగా అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ ఫ్రా సంస్థ రఫేల్ యుద్ధ విమానాల తయారీ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీని కింద కంపెనీ అనుబంధ సంస్థ రిలయన్స్ ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఫ్రెంచ్ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ మధ్య డీల్ జరిగింది. దీనికింద డసాల్ట్ సంస్థకు చెందిన ఫాల్కన్ 2000 బిజినెస్ట్ జెట్లను సంయుక్తంగా భారతదేశంలో తయారు చేసేందుకు ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ వార్త బయటకు రావటంతో రిలయన్స్ ఇన్ ఫ్రా సంస్థ షేర్లు నేడు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకాయి. ఒప్పందం కింద డసాల్ట్ సంస్థ తొలిసారిగా భారతదేశంలో తన ఫాల్కన్ విమానాలను అసెంబుల్ చేయాలని నిర్ణయించింది. ఫ్రాన్స్ బయట వీటిని అమెరికా, కెనడా, బ్రెజిల్ లో ఉత్పత్తి చేస్తుండగా ఈ జాబితాలోకి భారత దేశం కూడా అంబానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా ఎంట్రీ ఇచ్చింది. 2028 చివరి నాటికి కార్పొరేట్, సైనిక అవసరాల కోసం డసాల్ట్ మేడ్ ఇన్ ఇండియా ఫాల్కన్ 2000 జెట్స్ డెలివరీని మ్మొదలుపెట్టే లక్ష్యంతో తాజా డీల్ జరిగింది. రిలయన్స్ ఇన్ ఫ్రా సంస్థ వరుసగా డిఫెన్స్ రంగంలో అనేక ప్రాజెక్టులను చేపడుతూ వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. దీని ఫలితంగా గడచిన ఏడాది కాలంలో కంపెనీ షేర్లు ఏకంగా 83 శాతం పెరిగి ఇన్వెస్టర్లకు భారీ రాబడులను అందించాయి. అలాగే కంపెనీ షేర్లు 2025 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 20 శాతానికి పైగా రాబడిని అందించాయి. కంపెనీ షేర్ల 52 వారాల గరిష్ఠ ధర రూ.421 వద్ద ఉండగా.. నేడు మార్కెట్లు ముగిసే సమయంలో స్టాక్ ధర ఒక్కోటి రూ. 386.50 వద్ద తన ప్రయాణాన్ని ముగించింది.

# బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్.. హాజరుకాని కిషన్ రెడ్డి, బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ చేపడుతోన్న బనకచర్ల ప్రాజెక్టుపై అఖిలపక్ష ఎంపీలతో తెలంగాణ సచివాలయంలో ఇరిగేషన్ శాఖ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తోంది. బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని వివరిస్తున్నారు ఇరిగేషన్ అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్



రెడ్డి, సురేష్ షెట్కార్,రేణుకా చౌదరి,ఎంపీ చామల, ఓవైసీ, బీజేపీ నుంచి డీకే అరుణ,రఘునందన్ రావు, బీఆర్ఎస్ నుంచి రవిచంద్రన్ హాజరయ్యారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ హాజరు కాలేదు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్.. బనకచర్లపై కేంద్రానికి ఏపీ ఫ్రీ ఫిజిబులిటీ సమర్పించిందన్నారు.ఏపీ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘించిందని చెప్పారు.అన్ని పార్టీలను మేము సంప్రదించాం.. బనకచర్లపై అన్ని పార్టీల ఎంపీల అభిప్రాయాలు కీలకమన్నారు. సీఎం సూచనలతో అఖిలపక్ష ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు.

# రెండో బిడ్డకు జన్మనిచ్చిన టాలీవుడ్ హీరోయిన్?.. పోస్ట్ పెట్టింది సరే.. ఎందుకింత సీక్రెట్?

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ బ్యూటీ ఇలియానా క్రేజ్ ఎలాంటిదో అందరికీ తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడలో పలు మూవీస్ చేసి స్టార్ డం




సంపాదించుకుంది. ఇప్పుడీ ఈ బ్యూటీ సినిమాలకు దూరంగా ఉంటూ ఫ్యామిలీ లైఫ్ లీడ్ చేస్తోంది. ఇలియానా పోర్చుగీసుకి చెందిన వ్యాపార వేత్త మైఖేల్ డోలన్?ను పెళ్లాడిన విషయం తెలిసిందే. ఈ జంటకి ఆగస్టు 2023 సంవత్సరంలో కొడుకు పుట్టాడు. ఇక ఇటీవల ఆమె రెండోసారి కూడా తల్లి కాబోతోందని వార్తలొచ్చాయి. అయితే, ఇటీవలే ఫాదర్స్ డే సందర్భంగా ఓ పోస్ట్ పెట్టి అందరికీ సర్ప్రైజ్ ఇచ్చింది.అందులో తన భర్త డోలన్.. పసికందును ముద్దాడుతున్న ఫొటోను షేర్ చేసింది. దానికి బెస్ట్ డాడీ అని క్యాప్షన్ ఇచ్చింది. రోజుల బిడ్డతో ఉన్న ఆ ఫోటో కనిపించడంతో నెటిజన్లు 'ఇలియానా రెండో బిడ్డకు జన్మనిచ్చిందా?" అని ప్రశ్నిస్తున్నారు.మరి ఈ విషయంపై మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా సీక్రెట్ గానే ఉంచారు. అభిమానులు మాత్రం ఇలియానా అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. త్వరలో మంచి రోజు చూసి చెబుతుందేమో చూడాలని? పోస్ట్ పెట్టింది సరే..ఎందుకింత సీక్రెట్ ఉంచుతుంది? అనౌన్స్ చేయొచ్చు కదా.. ? అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

ఇక ఇలియానా కెరీర్ వి షయానికి వస్తే. తెలుగుతో పాటు తమిళం, హిందీ. భాషల్లో నటించి తన మార్క్ వేసింది. ఇటీవల ఆమె 'దోబెర్ దో ప్యార్' అనే హిందీ చిత్రంలో కనిపించింది. అయితే ప్రెగ్నెన్సీ కారణంగా ఆమె 'రైడ్ 2' వంటి పెద్ద అవకాశాలను వదులుకోవాల్సి వచ్చింది.చివరగా తెలుగులో అమర్ అక్బర్ ఆంటోని సినిమాలో నటించింది. 2024లో "డో ఔర్ డో ప్యార్" అనే హిందీ మూవీలో నటించింది. షీర్షా గుహ ఠాకుర్తా తెరకెక్కించిన రొమాంటిక్ కామెడీ మూవీలో విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ కీలక పాత్రల్లో కనిపించారు.ఆ తర్వాత సోషల్ మీడియాలో వరుస పోస్టులతోనే తెలుగు ప్రేక్షకులకు కనిపిస్తుంది.

# ఇరాన్ యుద్ధంలోకి దిగబోతున్నాం: ట్రంప్ ప్రకటనతో మూడో ప్రపంచ యుద్ధం వచ్చేసిందా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** గడచిన ఆరు రోజులుగా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు ప్రతిదాడులు తారా స్థాయికి చేరాయి. అమెరికా పదేపదే హెచ్చరించినప్పటికీ అవి అస్సలు పట్టించుకోని ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేనీ. ఇరాన్ లొంగిపోదని ఖమేనీ తాజాగా ఒక టీవీ ప్రసంగం ద్వారా ప్రకటించారు. ఏదైనా %ఖూ% సైనిక జోక్యం కోలుకోలేని నష్టాన్ని తెస్తుందని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ రాత్రి దాడుల తర్వాత వేల మంది ప్రజలు టెహ్రాన్ ప్రాంతాన్ని వీడి వెళ్లిపోయిన తరుణంలో ఖమేనీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా యుద్ధంలోకి దిగితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఖమేనీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే మరోపక్క అమెరికా మాత్రం ఇజ్రాయెల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనే అంశంపై ఆలోచినట్లు వెల్లడైంది. ప్రస్తుతం ఇరాన్ బేషరతుగా సరెండర్ కావాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును తిరస్కరిస్తున్నట్లు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తన తాజా టీవీ ప్రసంగంలో వెల్లడించారు. ఈ పరిస్థితులు ప్రస్తుతం మూడో ప్రపంచ యుద్ధం దిశగా దారితీస్తున్నాయని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇరాన్ దేశంతో యుద్ధం ఇజ్రాయెల్ కు భారీ భారంగా మారుతోంది. అయితే ప్రస్తుతం ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ ఇంటర్ సెప్టార్లు కేవలం 10 రోజులకు సరిపోతాయని వెల్లడైంది. ఈ తరుణంలో అమెరికా నుంచి సరఫరాలు పెంచుకోవటం లేదా నేరుగా అమెరికా సైనికులు యుద్ధ రంగంలోకి దిగటం అనే రెండు చివరి ఆప్షన్లు మిగిలి ఉన్నాయని యుద్ధ నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ చేస్తున్న బాంబు దాడుల నుంచి తనను తాను రక్షించుకునే "చట్టబద్ధమైన" హక్కు ఇరాన్‌కు ఉందని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రత్యక్ష సైనిక సహాయం అందించడం వల్ల మధ్యప్రాచ్యం తీవ్రంగా అస్థిరపడుతుందని రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ బుధవారం హెచ్చరించారు. గడచిన 5 రోజుల్లో ఇజ్రాయెల్ చేసిన దాడులతో ఇరాన్ లోని 1100 ప్రాంతాల్లో బాంబుల మోత మోగింది.

**ఇరాన్ కి ట్రంప్ వార్నింగ్..**

సుప్రీం లీడర్ అని చెప్పుకుంటున్న ఖమేనీ ఎక్కడ దాక్కున్నాడో ఖచ్చితమైన ప్రదేశం తమకు తెలుసని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో అన్నారు. ఆయన తమకు చాలా ఈజీ టార్గెట్ అని, అయితే అతడిని తాము చంపాలని అనుకోవటం లేదని చెప్పారు. కనీసం ప్రస్తుతానికి చంపే ఉద్దేశంలో లేనట్లు చెప్పారు. అయితే తాము సామాన్య ప్రజలు, అమెరికా సైనికులపై దాడులను సహించబోమని హెచ్చరించారు. తమ సహనాన్ని పరీక్షించొద్దని.. దీనిని మీరు త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాయని తాను భావిస్తున్నట్లు ఖమేనీకి వార్నింగ్ ఇచ్చారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం: సోదరుడి పాడె మోసిన రమేష్ విశ్వాస్..భావోద్వేగ వీడియో వైరల్

**హైదరాబాద్ పెన్ పవర్:** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం ఎంత విషాదాన్ని మిగిల్చిందో తెలిసిందే..ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బందితోపాటు 54 మంది బీజే మెడికల్ కాలేజీ మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోయారు. చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఒకే ఒక్కడు రమేష్ విశ్వాస్ బతికి బయటపడ్డాడు.. అయితే ఇదే ప్రమాదంలో రమేష్ విశ్వాస్ సోదరుడు అజయ్ రమేష్ కూడా ప్రాణాలో కోల్పోయారు. బుధవారం(జూన్18) దయ్యూలో అజయ్ అంత్యక్రియల్లో పాడే మోస్తూ రమేష్ విశ్వాస్ పాడే మోస్తూ విలపిస్తున్న దృశ్యాలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.



బుధవారం జరిగిన అజయ్ విశ్వాస్ అంత్యక్రియాల్లో విమాన ప్రమాదం నుంచి బయటపడిన ఒకే ఒక్కడు రమేష్ విశ్వాస్ పాల్గొన్నాడు. ఈ ప్రమాదంలోనే ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒకరు అజయ్ విశ్వాస్.. ఈ వీడియోలు రమేష్ ఇంకా కాలిన గాయాల నుంచి ఇంకా కోలుకోలేదు..అయినా అతని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సోదరుడు అంతిమయాత్రలో పాల్గొన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సోదరుడి పాడె మోస్తూ రోదిస్తూ కనిపించారు రమేష్ విశ్వాస్.

**విమాన ప్రమాద మృతులకు అంత్యక్రియలు..**

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి డీఎన్ ఏ టెస్ట్ ద్వారా మృతదేహాలను గుర్తించి బంధువులకు అప్పగించారు అధికారులు. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇప్పటివరకు 190 మంది ప్రమాద బాధితులను గుర్తించారు. 159 మృతదేహాలను ఇప్పటికే కుటుంబాలకు అప్పగించామని అధికారులు బుధవారం తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమవారం పూర్తి రాష్ట్ర గౌరవాలతో మహారాష్ట్రలో జరిగాయి. మంగళవారం కెప్టెన్ సుమీత్ సభర్వాల్, సీనియర్ సిబ్బంది అపర్ణ మహాదిక్, మైథిలి పాటిల్ లకు వారి స్వస్థలాలైన ముంబై, రాయ్ గఢ్, గోరేగావ్ లలో అంత్యక్రియలు జరిగాయి. ఈ ప్రమాదంలో నే ప్రాణాలు కోల్పోయిన అజయ్ విశ్వాస్ అంత్యక్రియలు గోవాలో అజయ్ విశ్వాస్ అంత్యక్రియలు బుధవారం జరిగాయి. సోదరుడి అంత్యక్రియల్లో కాలిన గాయాలతోనే రమేష్ విశ్వాస్ పాల్గొన్న హృదయ విదారక దృశ్యాలు అందరిని కలిచివేశాయి.

# ఆ పని ఇంకా పూర్తి చేయలేదా? ఐతే మీ బ్యాంక్ లాకర్ సీజ్ అవ్వొచ్చు తెలుసా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి కాలంలో బ్యాంకులో లాకర్ కలిగి ఉండటం చాలా సర్వ సాధారణంగా మారిపోయింది. ఎందుకంటే విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు, ఇతర వస్తువులను ఇంట్లో ఉంచుకోవటం కంటే లాకర్లలో భద్రపరచుకోవటం సేఫ్ అని చాలా మంది భావిస్తున్నారు. అయితే లాకర్లకు సంబంధించిన నిబంధనలను రిజర్వు బ్యాంక్ మార్పు చేయగా దానికి సంబంధించి కొత్త అగ్రిమెంట్లను బ్యాంకులు తమ ఖాతాదారులతో తిరిగి సంతకాలు తీసుకుంటున్నాయి.

రిజర్వు బ్యాంక్ తీసుకొచ్చిన కొత్త రూల్స్ ప్రకారం ఖాతాదారులు తమ బ్యాంక్ లాకర్లకు సంబంధించిన కొత్త అగ్రిమెంట్లపై సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికీ చాలా మంది దానిని పూర్తి చేయలేదని వెల్లడైంది. ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఖాతాదారులకు సంబంధించిన లాకర్లు సీజ్ అయ్యే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన గడువును రిజర్వు బ్యాంక్ పలుమార్లు పొడిగించింది. కొత్త అగ్రిమెంట్లలో బ్యాంక్ నిర్లక్ష్యం వల్ల లాకర్లో భద్రపరచిన వస్తువులకు సంబంధించి చట్టపరంగా ఎలా ముందుకెళ్లాలనే అంశాల్లో మార్పులు తీసుకొచ్చారు. లాకర్ల విషయంలో నిరంతరం వస్తున్న కంప్లెయింట్ల దృష్ట్యా రిజర్వు బ్యాంక్ లాకర్ పాలసీలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. మార్పు చేసిన నిబంధనలు కస్టమర్లకు రక్షణను పెంచటంతో పాటు పారదర్శకత పెంపు, చట్టపరమైన సమస్యలను పరిష్కారానికి వెసులుబాట్లు కల్పించబడ్డాయి. కొత్త రూల్స్ ప్రకారం లాకర్‌లోని వస్తువులను భద్రపరచడం బ్యాంకు బాధ్యత. 2025 డిసెంబర్ నాటికి కొత్త లాకర్ అగ్రిమెంట్లపై ఖాతాదారులు సంతకం చేయకపోతే వారికి లాకర్ల యాక్సెస్ నిలిపివేయవచ్చు, అలాగే కొన్నిసార్లు బ్యాంక్ సదరు వ్యక్తికి సంబంధించిన లాకర్లను సీజ్ చేసే ప్రమాదం కూడా ఉంది. అందుకే కస్టమర్లు వెంటనే తమ లాకర్లు ఉన్న బ్యాంక్ శాఖలను సంప్రదించి దీనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు ఈ సమాచారాన్ని ఈమెయిల్స్, ఫోన్ మెసేజెస్ ద్వారా అందిస్తూ వెంటనే స్పందించి అగ్రిమెంట్లను అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచిస్తున్నాయి.

# టీమిండియాలోకి రీఎంట్రీ నా లక్ష్యం.. నన్ను నేను సెలక్ట్ చేసుకోలేను కదా: ఉమేశ్ యాదవ్

- భారత జట్టులోకి మళ్లీ రావాలని ఉమేశ్ యాదవ్ ఆకాంక్ష
- దేశవాళీ క్రికెట్‌లో రాణింపు ద్వారా చోటు దక్కించుకుంటానని వెల్లడి
- 2023 టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ తర్వాత జట్టుకు దూరం
- ఫిట్‌నెస్‌పై దృష్టి సారించి, పోటీ క్రికెట్ ఆడతానన్న ఉమేశ్
- కొన్ని జరగాల్సినవి జరుగుతాయంటూ తన ప్రస్థానం గుర్తుచేసుకున్న పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత సీనియర్ ఫాస్ట్ బౌలర్ ఉమేశ్ యాదవ్ మరోసారి జాతీయ జట్టులోకి వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జట్టుకు దూరంగా ఉన్నప్పటికీ, దేశవాళీ క్రికెట్‌లో రాణించి, ఫిట్‌నెస్ నిరూపించుకుని తిరిగి భారత జట్టులో స్థానం సంపాదించేందుకు తీవ్రంగా శ్రమిస్తానని 37 ఏళ్ల ఉమేశ్ స్పష్టం చేశారు. ఉమేశ్ యాదవ్ చివరిసారిగా 2023లో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు తరఫున ఆడారు. ఆ మ్యాచ్‌లో అతను 40 ఓవర్లు బౌలింగ్ చేసి 131 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు మాత్రమే తీశారు. ఆ తర్వాత పేలవ ఫామ్, గాయాలు, యువ బౌలర్ల రాకతో అతనికి జట్టులో అవకాశాలు తగ్గిపోయాయి.

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "టీమిండియాలో మళ్లీ చోటు కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. అయితే, నన్ను నేను ఎంపిక చేసుకోలేను కదా?" అంటూ ఉమేశ్ యాదవ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. "పోటీ క్రికెట్ ఆడి, పూర్తి ఫిట్‌నెస్ సాధించి జాతీయ జట్టులోకి రావడానికి నా వంతు కృషి చేస్తాను. నేను క్రికెట్ ఆడటం ప్రారంభించినప్పుడు, అసలు భారత జట్టుకు ఆడతానని ఊహించలేదు" అని తన ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. తాను సహజసిద్ధమైన ఫాస్ట్ బౌలర్‌నని, చిన్నప్పటి నుంచే వేగంగా బంతులు వేసేవాడినని ఉమేశ్ తెలిపారు. "నేనెప్పుడూ ఏ అకాడమీకి వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకోలేదు. అందుకే జాతీయ జట్టుకు ఆడతానని అనుకోలేదు. ఎవరో చెబితే నెమ్మదిగా వివిధ టోర్నీలలో ఆడాను. అలా క్రమంగా ఒక బొగ్గుగని కార్మికుడి కుమారుడైన నేను భారత్‌కు ఆడాను. కొన్ని జరగాల్సినవి జరుగుతాయని నేను నమ్ముతాను. ఫాస్ట్ బౌలర్లు సహజంగానే ఉంటారని నేను ఎప్పుడూ చెబుతుంటాను" అని ఉమేశ్ వివరించారు.

# ఆ రెండు స్థానాలపై సందిగ్ధత: ఇంగ్లాండ్‌తో తొలి టెస్ట్.. రవిశాస్త్రి ప్లేయింగ్ 11 ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 20 నుంచి ఇంగ్లాండ్, ఇండియా జట్ల మధ్య ప్రారంభం కానున్న 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. 2025-2027 టెస్ట్ సైకిల్ లో భాగంగా ఇరు జట్లకు ఇదే తొలి సిరీస్. ఇప్పటికే ఇరు జట్లు లీడ్స్ చేరుకొని తొలి టెస్ట్ గెలుపే లక్ష్యంగా ప్రాక్టీస్ లో చెమటోడుస్తున్నాయి. శుక్రవారం (జూన్ 20) లీడ్స్ వేదికగా హెడ్డింగ్లీ వేదికగా జరగనున్న ఈ టెస్టులో ఇంగ్లాండ్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. మరోవైపు టీమిండియా పూర్తిగా యంగ్ స్టార్లతోనే బరిలోకి దిగుతుంది. ఇంగ్లాండ్ లాంటి పిచ్ లపై భారత యువ జట్టుకు అతి పెద్ద సవాలుగా మారనుంది. కనీసం ఇంగ్లాండ్ కు పోటీ అయినా ఇస్తారో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంగతి పక్కన పెడితే ఈ మ్యాచ్ లో భారత్ ఎలాంటి ప్లేయింగ్ 11 తో బరిలోకి దిగుతుందో ఆసక్తికరంగా మారింది. భారత మాజీ కోచ్ రవిశాస్త్రి ఇంగ్లాండ్ తో టీమిండియా ఆడబోయే తన జట్టును ప్రకటించాడు. శాస్త్రి తన జట్టులో 5 గురు బ్యాటర్లు.. ఒక వికెట్ కీపర్.. ఇద్దరు ఆల్ రౌండర్లు.. ముగ్గురు స్పెషలిస్ట్ సీమర్లను ఎంచుకున్నాడు. ఓపెనర్లుగా జైశ్వాల్ తో పాటు రాహుల్ ను ఎంచుకున్నాడు. మూడో స్థానంలో అభిమన్యు ఈశ్వరన్ కాకుండా సూపర్ ఫామ్ లో ఉన్న సాయి సుదర్శన్ కు ఛాన్స్ ఇచ్చాడు. కోహ్లీ స్థానంలో నాలుగో స్థానంలో గిల్ ఆడాల్సిందిగా సూచించాడు. 8 ఏళ్ళ తర్వాత భారత జట్టులోకి ఎంపికైన కరుణ్ నాయర్ ను ఐదో స్థానానికి ఎంపిక చేశాడు. వికెట్ కీపర్ గా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఆరో స్థానంలో ఆడనున్నాడు. స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను సెలక్ట్ చేశాడు. ఎనిమిదో స్థానంలో శాస్త్రి ఎటూ తేల్చుకోలేకపోయాడు. శార్దూల్ ఠాకూర్, నితీష్ రెడ్డి మధ్య ఎంపిక కష్టతరమైనదని తెలిపాడు. ముగ్గురు ఫాస్ట్ బౌలర్లతో పాటు శార్దూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకుంటాను. అని చెప్పిన శాస్త్రి.. నితీష్ 12 నుంచి 14 ఓవర్లు బౌలింగ్ చేసినట్టయితే అతనికి ఛాన్స్ ఇస్తానని అన్నాడు. బౌలింగ్ అటాక్ విషయానికి వస్తే.. లీడ్స్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్లేయింగ్ ఎలెవన్‌లో ముగ్గురు పేసర్లు ఉండాలని శాస్త్రి చెప్పాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలను ఎంపిక చేశాడు. ఒకవేళ లీడ్స్‌లో వాతావరణం మేఘావృతంగా ఉంటే, మేనేజ్‌మెంట్ ప్రసిద్ కృష్ణ కంటే అర్షదీప్ సింగ్‌కు ఛాన్స్ ఇవ్వాలని తన అభిప్రాయాన్ని చెప్పాడు. 2007లో చివరిసారిగా టీమిండియా ఇంగ్లాండ్ గడ్డపై టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది.

# ఒకే గ్రూప్‌లో ఇండియా, పాకిస్థాన్.. 2026 మహిళల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ఫ్యాన్స్ కు ఐసీసీ మరో గుడ్ న్యూస్ చెప్పింది. బుధవారం (జూన్ 18) 2026 మహిళల టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇంగ్లాండ్ వేదికగా జరగనున్న వరల్డ్ కప్ జూన్ 12 నుండి జూలై 5 వరకు జరుగుతుంది. లండన్‌లోని లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో ఫైనల్ జరుగుతుంది. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు శ్రీలంకతో తలపడనుంది. ఈ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతుంది. మహిళా క్రికెట్ లో తొలిసారి తొలిసారిగా 12 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. దీంతో మహిళా ప్రపంచ కప్ చరిత్రలో ఇదే అతి పెద్ద ఎడిషన్ కాబోతుంది. మొత్తం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్ లో ఆరు జట్లు ఉంటాయి. గ్రూప్ 1లో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇండియా, పాకిస్థాన్ ఉన్నాయి. మరో రెండు జట్లు గ్లోబల్ క్వాలిఫైయర్ ఆడి అర్హత సాధిస్తాయి. గ్రూప్ 2లో ఇంగ్లాండ్, డిఫెండింగ్ ఛాంపియన్స్ న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్ ఉన్నాయి. మరో రెండు జట్లు గ్లోబల్ క్వాలిఫైయర్ ఆడి అర్హత సాధిస్తాయి. ప్రతి గ్రూప్ నుండి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీ ఫైనల్ కు చేరుకుంటాయి. జూన్ 30, జూలై 2 తేదీలలో వరుసగా రెండు సెమీ ఫైనల్స్ జరుగుతాయి. ది ఓవల్ సెమీ ఫైనల్ కు ఆతిథ్యమిస్తుంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ జూన్ 14 న ఎడ్జ్ బాస్టన్ లో జరగనుంది. జూన్ 17 క్వాలిఫయర్ తో ,జూన్ 21 న సౌతాఫ్రికాతో, జూన్ 25 న క్వాలిఫయర్ తో, జూన్ 28 న ఆస్ట్రేలియాతో తలబడాల్సి ఉంది. ఎడ్జ్‌బాస్టన్, హాంప్‌షైర్ బౌల్, హెడింగ్లీ, ఓల్డ్ ట్రాఫోర్డ్, ది ఓవల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్, లార్డ్స్‌లో మ్యాచ్ లు జరుగుతాయి. టోర్నీలో మొత్తం 33 మ్యాచ్ లు జరుగుతాయి. ఐపీఎల్ 2026 తర్వాత ఈ టోర్నమెంట్ జరగనుంది. ఐపీఎల్ కు ముందు భారత్ వేదికగా మెన్స్ టీ20 వరల్డ్ కప్ జరుగుతుంది.

## అవ్నీత్ కౌర్ మండుతున్న ఆరెంజ్ దుస్తులలో వేడిని పెంచింది



# వివాహంతో అఖిల్ కెరీర్ మారబోతుందా?



ఇటీవలే అక్కినేని వారసుడు అఖిల్ వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ముంబైకి చెందిన జైనబ్ రవ్జీని వివాహం చేసుకుని ఓ ఇంటి వాడయ్యాడు. బ్యాచ్లర్ లైఫ్ కి గుడ్ బై చెప్పేసాడు. మరి ధాంపత్య జీవితం అఖిల్ కెరీర్ ని మార్చే అవకాశం ఉందా? బ్యాచిలర్ లైఫ్ కంటే మ్యారీడ్ లైఫ్ అతడి వృత్తిగత జీవితాన్ని ట్రాక్ లో పెట్టే అవకాశం ఉందా? అంటే అవుననే అనాలి. 'అఖిల్' అనే చిత్రంతో హీరోగా లాంచ్ అయిన అఖిల్ కు తొలి చిత్రం తేడా కొట్టింది. అక్కినేని వారసుడు గ్రాండ్ గా లాంచ్ అయిన అంచనాలు అందుకోలేకపోయాడు. అటుపై నటించిన హలో యావరేజ్ గా ఆడింది. మిస్టర్ మజ్ను ఫ్లాప్ అయింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచలర్ మాత్రం అఖిల్ ఫ్లాప్ ల బారి నుంచి బయట పడేసింది. ఆ సినిమా మంచి ఫలితాలే సాధించింది. కానీ అక్కినేని ఫ్యామిలీ రేంజ్ హిట్ కాదది.

దీంతో 'ఏంజెట్' కోసం అఖిల్ చాలా శ్రమపడ్డాడు. సిక్స్ ప్యాక్ లుక్...భారీ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో చేసిన చిత్రమిది. కట్ చేస్తే అన్ని సినిమాల కంటే దారుణమైన ఫలితాన్ని అందించింది. ఇలా నటించిన ఐదు సినిమాల్లో రెండు మాత్రమే ఊరటనిచ్చాయి. ఇదంతా అఖిల్ పెళ్లికి ముందు జరిగింది. అంటే అఖిల్ కెరీర్ లో ఫస్ట్ ఇన్నింగ్స్ ఇలా ముగిసింది. సెకెండ్ ఇన్నింగ్స్ జైనబ్ రవ్జీ జీవితంలోకి రావడంతో మొదలైంది. జీవిత భాగస్వామి రాకతో కెరీర్ లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయంటారు. పాజిటివ్ కోణంలో చూస్తే జీవితం మరింత గొప్పగా ప్రశాంతంగా, సక్సెస్ ఫుల్ గా ఉంటుందని పెద్దలు చెప్పే మాట. ఆ ప్రకారం చూస్తే అఖిల్ ప్రొఫెషనల్ కెరీర్ కి వివాహం కలిసి రావాలి. వివాహం అనంతరం రిలీజ్ అయ్యే తొలి సినిమా 'లెనిన్' . ప్రస్తుతం ఈ సినిమా ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

## గోల్డెన్ గ్లో: ఎ రేడియంట్ పోర్ట్రెయిట్ ఆఫ్ గాంభీర్యం



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com